ప్రజాశక్తి

శనివారం 9 సెప్టెంబర్ 2023 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

ప్రచార మెటీరియల్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

ప్రకాశం జిల్లా సమగ్రాభివృద్ధికే..

సిపిఎం పోరుబాట పాదయాత్ర

- ప్రజలు జయప్రదం చేయాలి
- సిపిఎం జిల్లా కమిటీ పిలుపు
- ప్రచార మెటీరియల్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రకాశం జిల్లాను వెనుకబడిన జిల్లాగా గుర్తించాలని, రూ.10 వేల కోట్ల ప్యాకేజీ ప్రకటించి జిల్లాలోని పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిపిఎం పోరుబాట పాదయాత్ర నిర్వహిస్తుందని సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ తెలిపారు. స్థానిక సుందరయ్య భవనంలో శుక్రవారం జరిగిన ఒక కార్యక్రమంలో పాదయాత్ర ప్రచారానికి సంబంధించిన మెటీరియల్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ మాట్లాడుతూ జిల్లా ఏర్పడి ఏళ్లు గడుస్తున్న నేటికీ సమగ్రంగా అభివద్ధి కాలేదని, అనేక రకాల సమస్యలు పెండింగ్ లో ఉన్నాయన్నారు. సాగునీటి ప్రాజెక్టులు, ఉపాధి కల్పన ప్రాజెక్టులు, రోడ్లు రైల్వే లైన్లు, పరిశ్రమలు, విద్య వైద్య సమస్యలు ఇలా అన్నింటిలో జిల్లా తీవ్రంగా వెనుకబడి ఉందన్నారు. జిల్లాను సమగ్రంగా అభివద్ధి చేయాలని ప్రభుత్వంపై ఒత్తిడి తేవడానికి ఈ పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు ఆయన తెలియజేశారు. ఈ పాదయాత్ర 6 నియోజక వర్గాల పరిధిలో ఈనెల 10వ నుండి 23వ తేదీ వరకు దొనకొండ నుండి ఒంగోలు వరకు 14 రోజులు 300 కిలోమీటర్లు ▶ 2లో

వరికి విరామంతో

ఆయకట్టు రైతుల్లో అలజడి

- ఆరుతడి పంటలకు నీటిపై అన్నదాతల్లో ఆందోళన
- నారుమడులు వృథా..
- మాగాణికి సిద్ధమైన రైతుల్లో నిరాశ

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

సాగర్ ఆయకట్టులో వరి సాగు వద్దని ఇరిగేషన్ మంత్రి రాంబాబు ప్రకటించారు. హఠాత్తుగా మంత్రి ప్రకటనతో సాగర్ ఆయకట్టు రైతుల్లో ఆందోళన రేగింది. ఇప్పటికే మాగాణికి రైతులు నారుమడులు పోశారు. నీళ్లు ఇస్తే నాట్లు వేసుకుందామనే ఆలోచనలోనే ఉన్నారు. ఎగువ నుంచి నీరు వస్తుందనే ఆశతోనే ఉన్నారు. అయితే మంత్రి ప్రకటనతో రైతుల్లో ఒక్కసారిగా నిరాశ కలిగింది. ముందస్తు వ్యూహం లేకుండా హఠాత్తుగా ప్రకటన చేయడంతో ప్రత్యామ్నాయంగా సాగర్ ఆయకట్టులో మాగాణి స్థానంలో ఏ పంటలు వేసుకోవాలో కూడా తెలియని పరిస్థితి వచ్చింది.

ముందుగానే నిర్ణయం తీసుకుంటే రైతులకు ఇతర పంటలు వేసుకునే అవకాశం ఉండేది. ఇప్పుడా పరిస్థితి లేదు. ఆరు తడి పంటలు వేసుకోవాలి. మాగాణి సాగు చేసే భూముల్లో పంటల మార్పిడి కూడా సానుకూలంగా ఉండదు. ఇప్పుడు ఏం చేయాలో అంతుచిక్కడం లేదని రైతులు వాపోతున్నారు. సాగర్ ఆయకట్టు కింద 1.90 లక్షల ఎకరాలు మాగాణి సాగు ఉంది. కొమ్మమూరు కాలువ కింద కూడా 70 వేల ఎకరాల్లో మాగాణి సాగు ఉంది. దీనికి నీటిపై స్పష్టత లేదు. ఎగువ నుంచి నీరే లేనందున దిగువనున్న ఆయకట్టుపైనా ఆశల్లేవు. ఈ ఏడాది మాగాణి లేనందున దిగుబడి రూపేణా రైతులు చాలా నష్టపోతున్నారు. పశువులకు మేత కూడా కొరత ఏర్పడనుంది. కూలీలకు సుమారు నాలుగు నెలల పాటు దొరికే పనులు కూడా లేనట్లే. ఇంకా చెప్పాలంటే సాగర్ ఆయకట్టులో కరువు వచ్చినట్లే. అన్ని రకాలుగా నష్టం జరిగింది. ఇతర పంటలకు వెళితే అవి ఎంతమేరకు చేతికి అందుతాయో కూడా తెలియని పరిస్థితి. ప్రస్తుతం రబీ సీజన్ మొదలైంది. రబీలో ఎక్కువగా మాగాణితోపాటు ఆరుతడి పంటలు సాగు ఉంటుంది. వర్షాధారం తక్కువ. మాగాణితో పాటు మిరప, మొక్కజొన్న, పొగాకు, పత్తి, మినుము వంటి పంటలు సాగవుతాయి. వీటికి అప్పుడప్పుడూ తడికి నీరు అవసరం ఉంది. శనగ కూడా భారీగా సాగు ఉన్నా పెద్దగా నీరు అవసరం లేదు. వాణిజ్య పంటలకు నీటి అవసరం కీలకం. తడుల కోసం సీజన్‌లో ఎన్ని ప్రయాసలు పడుతుంటారో చూస్తుంటాం. తోటలను కాపాడుకునేందుకు కిలోమీటర్ల కొద్దీ పైపులు వేసుకొని ఇంజన్ల ద్వారా నీటిని తరలిస్తుంటారు. ఇలాంటివి పర్చూరు, ఇంకొల్లు ▶ 2లో

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సీనియర్ డాక్టర్ నల్లూరి రంగారావు

ప్రజలకు అందుబాటులో కార్పొరేట్ వైద్యసేవలు

3లో

నేటి నుంచి జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర మహాసభలు

3లో

గృహాల మధ్య మురుగు ఉండటంపై

భట్టిప్రోలు ఎంపిడిఓకు షోకాజ్ నోటీసులు

- శానిటరీ ఇన్స్‌పెక్టర్‌కు కూడా..
- జ్వరాలతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే అధికారులకు చీమకుట్టినట్లు కూడా లేదు..
- కలెక్టర్ రంజిత్‌బాషా

మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

భట్టిప్రోలు మండలంలో గృహాల మధ్య మురికినీరు నిల్వ ఉన్నట్లు వచ్చిన ఫిర్యాదులు, నివేదికలపై కలెక్టర్ రంజిత్‌బాషా స్పందించారు. భట్టిప్రోలు ఎంపిడిఒకు, శానిటరీ ఇన్స్పెక్టర్‌కు షోకాజ్ నోటీసులు జారీచేయాలని డిపిఒను ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల నిర్వహణపై డివిజన్, మండల స్థాయి అధికారులతో శుక్రవారం స్థానిక కలెక్టరేట్ నుంచి ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు. ప్రజా ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దష్టి సారించిందని, అధికారులు మానవతాదక్పథంతో పనిచేయాలని కలెక్టర్ చెప్పారు. ప్రజలకు నేరుగా సేవలందించే గొప్ప అవకాశంగా అధికారులు భావించాలన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం మాదిరిగానే "జగనన్న ఆరోగ్య సురక్ష" కార్యక్రమాలు గ్రామస్థాయిలో నిర్వహించాలన్నారు. గ్రామాలలో విస్తతంగా ప్రచారం చేయాలని, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతిగ్రామంలో వైద్య శిబిరాల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేయాలని, వైద్యులను నియమించాలన్నారు. ఇందులో రెడ్ క్రాస్ సంస్థను భాగస్వాములను చేయాలన్నారు. ప్రజలకు ఎంతో మేలుచేసే కార్యక్రమాల జయప్రదం కోసం మండల ప్రత్యేక అధికారులు బాధ్యత తీసుకోవాలన్నారు. శారీరక దివ్యాంగులను గుర్తిస్తే తదుపరి కత్రిమ అవయవాలు అందించవచ్చున్నారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు ఏ గ్రామాలలో నిర్వహిస్తారో ముందస్తుగా ప్రకటన చేయాలని ఆయన సూచించారు. సీజనల్ వ్యాధుల వ్యాప్తిని అరికట్టేందుకు జిల్లావ్యాప్తంగా ▶ 2లో

కూలీలతో మాట్లాడుతున్న అధికారులు

వెట్టిచాకిరీ నుంచి విముక్తి..

- హ్యూమన్ రైట్స్ కమిషన్ ఆదేశాలతో స్పందించిన అధికారులు
- కూలీలకు జీతాలు ఇప్పించి..జార్ఖండ్ పంపేందుకు ఏర్పాట్లు

ప్రజాశక్తి-కొత్తపట్నం

మండల పరిధిలోని దేవరంపాడు గ్రామ సమీపంలో సర్వేనెంబర్ 534లో గోల్డెన్ ఆక్వా నిర్వాహకులు రొయ్యల సాగు చేస్తున్నారు. అక్కడ పనిచేస్తున్న కూలీలు తమతో వెట్టిచాకిరీ చేయిస్తూ.. సకాలంలో జీతాలు ఇవ్వడం లేదని, సొంత రాష్ట్రానికి వెళ్లకుండా నిర్బంధిస్తున్నారని హ్యూమన్ రైట్స్ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఘటన గురించి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్‌కు హెచ్ఆర్‌సి నుంచి సమాచారం అందింది. దీంతో కలెక్టర్ లేబర్, రెవెన్యూ అధికారులను అప్రమత్తం చేసి ఘటనా స్థలానికి పంపించారు. కూలీలను వారి సొంత రాష్ట్రానికి తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. ఒంగోలు రెవెన్యూ డివిజనల్ అధికారి విశ్వేశ్వరరావు, ఉపకార్మిక కమిషనర్ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు లేబర్ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, కొత్తపట్నం తహశీల్దార్ బివి.రమణారావు, ఒంగోలు తహశీలార్ మురళి ఘటనాస్థలానికి వెళ్లి కూలీలతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గోల్డెన్ ఆక్వా యాజమాన్యంతో చర్చలు జరిపి కూలీలకు జీతాలు ఇప్పించారు. అనంతరం 30 మంది ▶ 2లో

ప్రకాశం జిల్లా సమగ్రాభివృద్ధికే..

సిపిఎం పోరుబాట పాదయాత్ర

(మొదటిపేజీ తరువాయి)

పాదయాత్ర జరుగుతుందన్నారు. ఈ నెల 10వ తేదీ ఉదయం 10 గంటలకు దొనకొండ బస్టాండ్ సెంటర్‌లో పాదయాత్రను మాజీ రాజ్యసభ సభ్యులు, సిపిఎం పూర్వ రాష్ట్ర కార్యదర్శి పెనుమల్లి మధు ప్రారంభిస్తారన్నారు. ఈ నెల 23న ఒంగోలులో జరిగే ముగింపు సభకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు పాల్గొంటారని తెలియజేశారు. ఈ పాదయాత్రలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, జిల్లా కమిటీ సభ్యులు 10 మంది నడుస్తారని తెలిపారు. పాదయాత్రలో జిల్లా ప్రజానీకం, మేధావులు, అభివృద్ధి కాముకులు, అన్ని తరగతుల ప్రజలు సహాయ సహకారాలు అందించి పాదయాత్రలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పూనాటి ఆంజనేయులు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జివి కొండారెడ్డి, షేక్ మాబు, కంకణాల ఆంజనేయులు, చీకటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వరికి విరామంతో ఆయకట్టు రైతుల్లో ఆందోళన

(మొదటిపేజీ తరువాయి)

ప్రాంతాల్లో చూస్తుంటాము. ఈ ఏడాది ఇలాంటి పరిస్థితులే ఉత్పన్నమయ్యేలా ఉంది. రిజర్వాయర్లలో నీటి కొరత వల్ల కౌలు సాగు కూడా అయోమయంలో పడింది. కౌలుకు రైతులు ముందుకు రావడం లేదు. నీటిపై నమ్మకం లేక కౌలు రైతులు పొలాలను తీసుకోవడం లేదు. ఖరీఫ్‌లోనూ వర్షాల్లేక పంటలు 20 శాతం కూడా సాగవ్వలేదు. వేసిన పంటలు కూడా సరిగా లేవు. ఈ నెలలో కురిసిన వర్షాలకు కొంత ఊపిరి పీల్చుకున్నాయి. ఇప్పుడు రబీకి వర్షాలు ఆశాజనకంగా ఉన్నాయని రైతులు భావించారు. ఇంతలో సాగర్ ఆయకట్టులో వరికి నీరివ్వలేమని మంత్రి ప్రకటించారు. ఆరుతడి పంటలకు నీటి సరఫరాపై ఆశలు కనిపించడం లేదు. ఎందుకంటే కుడికాలువకు నీటిని విడుదల చేస్తేనే ఆరుతడి పంటలకైనా నీరు అవకాశం ఉంది. కాలువలకు నీరు ఇచ్చే పరిస్థితే లేనప్పుడు ఆయకట్టులో పరిస్థితి ఏమిటో చెప్పాల్సిన అవసరం లేదు. ఇక గుండ్లకమ్మ గేట్లు మరమ్మతులు లేనందున వర్షాలకు వచ్చిన నీరు కూడా వృథాగా పోతోంది. దీని కింద 80 వేల ఎకరాలకు ఆరుతడి పంటలకు నీరిచ్చే అవకాశం ఉన్నా ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఈ అవకాశం కూడా ఇలాంటి సమయాల్లో చేజారింది. నీరంతా దిగువకు పోతోంది. కొద్దిపాటి నీరే నిల్వ ఉంది. కాలువలకు నీరు విడుదల చేసే పరిస్థితి లేదు. తక్షణం గేట్లు మరమ్మతులు చేసి నీటిని నిల్వచేస్తే ఈ ప్రాంత రైతులకు ఎంతో కొంత మేలు జరుగుతుంది.

భట్టిప్రోలు ఎంపిడిఒకు షోకాజ్ నోటీసులు

(మొదటిపేజీ తరువాయి)

పారిశుద్ధ్య కార్యక్రమాల డ్రైవ్ నిర్వహించాలని తెలిపారు. ప్రతి పంచాయతీలో డ్రైవ్ చేపట్టాలన్నారు. వర్షాకాల సీజన్ లో మురికినీరు నిల్వలేకుండా అధికారుల చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా మురుగు కాల్వల పూడికతీత పనులు పదిరోజుల్లోనే పూర్తి చేయాలన్నారు. పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణపై ప్రత్యేక అధికారులను నియమిస్తామన్నారు. ప్రతి మండలానికీ 17 మంది అధికారులను పరిశీలన కోసం పంపుతామన్నారు. పారిశుద్ధ్య కార్యక్రమాలపై అధికారులు ఫొటోలు తీసి ధృవీకరించాలన్నారు. చెత్తసంపద కేంద్రాల నిర్వహణ మెరుగుపడాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాల నిర్వహణపై గ్రామస్థాయి ప్రణాళికలతో అధికారులు తేదీలు ఖరారు చేయాలని తెలిపారు. ప్రస్తుతం జ్వరాలతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే అధికారులకు చీమకుట్టినట్లు లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్టూరు మండలంలో 50 శాతమే పారిశుద్ధ్య కార్యక్రమాలు జరగడం ఏమిటని అధికారులను ప్రశ్నించారు. చినగంజాంలో 50 శాతం, నగరంలో 50 శాతం, అద్దంకి, అమర్తలూరు మండలాలలో పారిశుద్ధ్య కార్యక్రమాలు సరిగా చేయడం లేదని ఆయన అసహనం వ్యక్తం చేశారు. పారిశుద్ధ్యంపై ముగ్గురు ఆర్.డి.ఓలు, ముగ్గురు డి.ఎల్.డి.ఓలు తమ పరిధిలోని మండలాలలో విస్తృతంగా తనిఖీలు చేయాలన్నారు. బాలబాలికల వివరాలను స్టూడెంట్ ఇన్ఫోలో నమోదు చేయాలని కలెక్టర్ తెలిపారు. ఆరు నుంచి 18 సంవత్సరాల వయస్సులోపు చిన్నారులు రాష్ట్రంలో ఏ ప్రాంతంలోనైనా పాఠశాలలో చదువుతూ ఉండాలన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 713 మంది చిన్నారులను నేటికి గుర్తించలేకపోవడంపై కలెక్టరు ఆరా తీశారు. వారు ఏప్రాంతంలో ఉన్నారో, చదువుతున్నారా లేదా, వలసలు, తదితర వివరాలను గుర్తించాలని చెప్పారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల ప్రధానాచార్యులు, ప్రధానోపాధ్యా యులు కరస్పాండెంట్లతో మండల ప్రత్యేక అధికారులు, ఎమ్.ఇ.ఓలు, ఎమ్.పి.డి.ఓలు సమీక్ష చేయాలన్నారు.

ఓటర్ల సర్వే 15లోగా ముగించాలి

సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితా సర్వే ప్రక్రియ ఈనెల 15వ తేదీలోగా ముగించాలని జిల్లా ఎన్నికల అధికారి పి.రంజిత్ బాషా చెప్పారు. మతులు, శాశ్వత వలసలు, చిరునామ మార్పుల, చేర్పులకు సంబంధించిన ఎన్నికల కమిషన్ ఎలక్టోరల్ రోల్ ప్రక్రియ గడువు పూర్తిగా ముగుస్తుందన్నారు. తదుపరి మార్పులు, చేర్పులకు అవకాశం ఉండదనే విషయం గుర్తించాలన్నారు. జాబితాలో అక్షరదోషాలు, 90 సంవత్సరాలు దాటిన వృద్ధులు, ఒకే ఇంటి నెంబరు కింద 10 మందికి మించి ఓటర్లు ఉంటే పున:పరిశీలన చేయాలన్నారు. పోలింగ్ స్టేషన్ల మార్పుపై ఆయా నియోజకవర్గాలలో రాజకీయ పార్టీలతో సమీక్షలు నిర్వహించిన తదుపరి నివేదికలు పంపాలన్నారు. సమావేశంలో డిఎంహెచ్ఒ ఎస్ విజయమ్మ, ఆర్.డి.ఓలు జి.రవీందర్, పార్థసారథి, పి.సరోజిని, నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

తిరుమలకు మార్టూరు కూరగాయలు

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

కూరగాయల ఎగుమతికి దేశంలోనే ప్రసిద్ధి గాంచిన మార్టూరు కూరగాయల మార్కెట్ నుంచి తిరుమల వెంకన్న సన్నిధానంలో భక్తులకు నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి కూరగాయలు అందజేయడానికి రెండోసారి అనుమతి లభించింది. ఈ మేరకు తిరుమల దేవస్థానం నుంచి ప్రత్యేక వాహనం ద్వారా భక్తులు పంపించే కూరగాయలను సేకరించి ఆదివారం ఉదయం స్థానిక స్టేట్ బ్యాంకు సమీపంలో భక్తులకు ప్రసాదం అందజేయనున్నారు. గతంలో కూడా మార్టూరు నుంచి భక్తులు పంపించిన కూరగాయలను తిరుమల దేవస్థానం అన్నదాన కార్యక్రమానికి అనుమతించింది.

వెట్టిచాకిరీ నుంచి విముక్తి

(మొదటిపేజీ తరువాయి)

కూలీలను ఆర్‌డిఒ కార్యాలయానికి తరలించి భోజన సదుపాయాలు కల్పించారు. జార్ఖండ్ రాష్ట్రానికి పంపే ఏర్పాట్లు చేసినట్లు లేబర్ అధికారి ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. కార్యక్రమంలో ఎఎల్ఒ 1,2, మార్కాపురం, ఒంగోలు ఆర్ఐ ఫిరోజ్ పాల్గొన్నారు.

నంద్యాల నాయకుడికి టిడిపి నేతల అభినందనలు

ప్రజాశక్తి-పొదిలి

పొదిలికి చెందిన లాల్ ఫౌండేషన్ ఛైర్మన్, ఆల్ మోమిన్ కళాశాల కరస్పాండెంట్ ఆఖీబ్ అహమ్మద్ మిత్రులు నంద్యాల పట్టణానికి చెందిన మాజీ వైసిపి మైనారిటీ నాయకులు షేక్ వహీద్ హుస్సేన్ శుక్రవారం తెలుగుదేశం పార్టీలో చేరుతున్న సందర్భంగా వారిని మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. నంద్యాలలో జరిగిన కార్యక్రమంలో ప్రకాశం జిల్లా ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ రసూల్ మహమ్మద్, అధికార ప్రతినిధి షేక్ యాసిన్ పాల్గొన్నారు.

జనరల్ నోటీస్
మహారాజశ్రీ 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.P.No. 106/2021
O.S.No. 485/2017

ఏలూరి సతీష్ ....పిటిషనర్/డి.హెచ్.ఆర్.
వర్సెస్
దామచర్ల కోటేశ్వరమ్మ (డైడ్) మరియు ఇతరులు
.... రెస్పాండెంట్స్ /జే.డి.ఆర్

To
చెన్నారెడ్డి శ్రీలత,భర్త రాజా,
ముప్పరాజు వారి పాలెం గ్రామం,
కొండపి మండలం,ప్రకాశం జిల్లా..

పై నెంబరు ఇ.పిలో మీరు 3వ రెస్పాండెంట్ అయియున్నారు. మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపించినను మీకు చేరనందున శ్రీ కోర్టువారు మీకు నోటీసు నిమిత్తం ప్రజాశక్తి డైలీ పేపరు ప్రకాశం జిల్లా ఎడిషన్ లో పబ్లికేషన్ ద్వారా మీకు తెలియపరచుటకు ఆర్డరు వేసినారు. మీరు ఈ ప్రకటనను చూసిన పిదప తేది: 03-10-2023 న వాయిదా అయియున్నది ఆరోజు ఉదయం 10:30 గం.లకు మీరు గానీ, మీ తరఫున లాయరు గానీ కోర్టువారి ఎదుట హాజరై మీకు పై తెలిపిన ఇ.పిలో అభ్యంతరాలు ఉన్న యెడల తెలుపుకోవలెను. అట్లు మీరు హాజరు కాని యెడల మీకు ఎలాంటి ఆక్షేపణలు లేవని భావించి పై తెలిపిన ఇ.పిను కోర్టువారు మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.

ఒంగోలు
తేది : 08-09-2023 ఇట్లు
పంగులూరి గోవిందయ్య
పిటిషనరు తరపున న్యాయవాది,
ఒంగోలు

జనరల్ నోటీస్
మహారాజశ్రీ ఒంగోలు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
EPNo: 52/2021
OS No: 17/2018

నల్లమల్లి శ్రీలత ....డిక్రీ హోల్డర్/వాది.
వర్సెస్
దామచర్ల కోటేశ్వరమ్మ (డైడ్) మరియు ఇతరులు
..... రెస్పాండెంట్స్ /ప్రతివాదులు

To
చెన్నారెడ్డి శ్రీలత (3rd JDR),
భర్త రాజా,C/o చెన్నారెడ్డి నరసింహారావు,
ముప్పరాజువారి పాలెం గ్రామం,
కొండపి మండలం, ప్రకాశం జిల్లా,

పై నెంబరులో గల ఎగ్జిక్యూషన్ పిటీషన్ లో మీ నోటీసు నిమిత్తం ఎన్నిసార్లు పంపినా నోటీసు చేరనందున శ్రీ కోర్టువారు ప్రజాశక్తి పత్రికా ప్రకటన ద్వారా మీకు నోటీసు జారీ చేయమని ఉత్తర్వులు ఇచ్చియున్నారు. కావున ఈ ప్రకటన చూసి మీరుగాని, మీ తరపు న్యాయవాది గాని తేది: 25-09-2023 ఉదయం గం. 10.30 ని.లకు పై తెలిపిన కోర్టు ఎదుట హాజరై మీ అక్షేపణలు తెలుపు కోవలసినది. లేనియెడల ఆక్షేపణలు లేవని భావించి కోర్టువారు పై తెలిపిన ఎగ్జిక్యూషన్ పిటిషన్ లో మీ పరోక్షమున తీర్పు చెప్పెదరని ఇందుమూలంగా మీకు కోర్టు వారి ఉత్తర్వుల మేరకు తెలియపరచటమైనది.

ఒంగోలు
తేది : 08-09-2023 ఇట్లు
పంగులూరి గోవిందయ్య
వాది తరఫున న్యాయవాది,
ఒంగోలు

జిల్లా పాదయాత్ర కరపత్రం ఆవిష్కరణ

ప్రజాశక్తి-పిసిపల్లి

సిపిఎం చేపట్టిన పాదయాత్ర సందర్భంగా శుక్రవారం సాయంత్రం పీసీపల్లిలో సిపిఎం నాయకులు బడుగు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడిన మూడు ప్రాంతాలను కలిపి 1970 సంవత్సరంలో ప్రకాశం జిల్లాను ఏర్పాటు చేశారన్నారు. అప్పటి నుంచి నేటి వరకు పాలకుల నిర్లక్ష్యం మూలంగా జిల్లా వెనుకబడి ఉందన్నారు. ఈ సందర్భంగా జిల్లాకు పదివేల కోట్ల రూపాయలు నిధులు కేటాయించి జిల్లాను అభివృద్ధి చేయాలని కోరుతూ సిపిఎం పాదయాత్ర చేపడుతోందని తెలిపారు. ఈ నెల 10వ తేదీ దొనకొండ నుంచి ప్రారంభమయ్యే పాదయాత్ర 14 రోజులపాటు 300 కిలోమీటర్ల దూరం నడుస్తూ 23వ తేదీ ముగుస్తోందని అన్నారు. ఈ పాదయాత్ర పీసీపల్లి మండలంలో 17వ తేదీ ప్రవేశిస్తోందన్నారు. ఎక్కువ మంది కిడ్నీ రోగులు ఉన్న పీసీపల్లి మండలానికి సాగర్ నీటిని కుళాయిల ద్వారా ఇంటింటికీ సరఫరా చేయాలని, వెలుగొండ ప్రాజెక్టు పరిధిలో పీసీపల్లి మండలాన్ని చేర్చాలని, పిసిపల్లెలో డయాలసిస్ యూనిట్ ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో పాదయాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో కొండ్రెడ్డి పెదనాగిరెడ్డి, నేలపాటి అంకయ్య, ప్రకాశం, ఏసేపు, మీనిగ వెంగయ్య, నడికట్ల తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-హనుమంతునిపాడు

జిల్లా సమగ్ర అభివృద్ధి కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పాదయాత్ర ప్రచార కరపత్రాన్ని పార్టీ మండల నాయకులు బడుగు వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. అనంతరం మండల కేంద్రంలో విస్తృతంగా పంపిణీ చేసి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకాశం జిల్లా అన్ని విధాలుగా వెనుకబడిపోయిందని, జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి జిల్లా అభివృద్ధి కోసం పదివేల కోట్ల రూపాయల ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. పాదయాత్రను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శాఖ కార్యదర్శి కత్తి ఏబు, గురునాథం, రాములు, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

మహారాజ శ్రీ ఒంగోలు 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
O.S.No.331/2022

ఆతుకూరి భోళా శంఖర్ ...వాది
Vs.
వాసిపల్లి సంధ్యా .... ప్రతివాది

To
ప్రతివాది
Vasipalli Sandhya
Wife of Anjana Reddy
Business, Prop. of Happy Industries
R/o.Door No.6-229, Sreenagar Colony
Ongole, Prakasam District.

పై కేసులో మీకు నోటీసు నిమిత్తం అనేక పర్యాయాలు రిజిష్టరు పోస్టుద్వారా, కోర్టుద్వారా నోటీసులు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయు చున్నందున. కోర్టువారి వుత్తర్వుల ప్రకారం ఈ పేపరు ద్వారా మీకు నోటీసు పంపడమైనది. కావున మీరు 21-09-2023న పై కోర్టువారి ఎదుట ఉదయం 10-30 గంటలకు స్వయంగా గాని, లాయరుద్వారా గాని హాజరై మీకుగల ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేనియడల మీపరోక్షమున తీర్మానించబడునని యిందు మూలంగా తెలియపరచటమైనది.

వాయిదా : 21-09-2023 ఇట్లు
బొడ్డు రామలింగం
వాది తరఫున న్యాయవాది.
ఒంగోలు

జనరల్ నోటీస్
మహారాజశ్రీ 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.P.No.88/2021
O.S.No. 443/2018

దేపూరి స్రవంతి ...పిటిషనర్ /డి.హెచ్.ఆర్.
వర్సెస్
రామచర్ల కోటేశ్వరమ్మ (డైడ్) మరియు ఇతరులు
... రెస్పాండెంట్స్ /జె.డి.ఆర్

To
చెన్నారెడ్డి శ్రీలత,భర్త రాజా.
ముప్పరాజు వారి పాలెం గ్రామం,
కొండపి మండలం,ప్రకాశం జిల్లా.

పై నెంబరు ఇ.పిలో మీరు 3వ రెస్పాండెంట్ అయియున్నారు. మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపించినను మీకు చేరనందున శ్రీ కోర్టువారు మీకు నోటీసు నిమిత్తం ప్రజాశక్తి డైలీ పేపరు ప్రకాశం జిల్లా ఎడిషన్ లో పబ్లికేషన్ ద్వారా మీకు తెలియపరచుటకు ఆర్డరు. వేసినారు. మీరు ఈ ప్రకటనను చూసిన పిదప తేది: 03-10-2023 న వాయిదా అయియున్నది ఆ రోజు ఉదయం 10:30 గం.లకు మీరు గానీ, మీ తరఫున లాయరు గానీ కోర్టువారి ఎదుట హజరై మీకు పై తెలిపిన ఇ.పిలో అభ్యంతరాలు ఉన్న యెడల తెలుపుకోవలెను. అట్లు మీరు హాజరు కాని యెడల మీకు ఎలాంటి ఆక్షేపణలు లేవని భావించి పై తెలిపిన ఇ.పిను కోర్టువారు మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.

ఒంగోలు
తేది : 08-09-2023 ఇట్లు
పంగులూరి గోవిందయ్య
పిటిషనరు తరపున న్యాయవాది,
ఒంగోలు

జనరల్ నోటీసు
మహారాజశ్రీ 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
EPN0: 87/2021
OS No: 442/2018

కొవూరి అరుణ .. పిటిషనర్/డి.హెచ్.ఆర్
వర్సెస్
దామచర్ల కోటేశ్వరమ్మ (డైడ్) మరియు ఇతరులు
... రెస్పాండెంట్స్ /జి.డి.ఆర్

To
చెన్నారెడ్డి శ్రీలత, భర్త రాజా
ముప్పరాజు వారిపాలెం గ్రామం,
కొండపి మండలం, ప్రకాశం జిల్లా

పైనెంబరు ఇ.పిలో మీరు 3వ రెస్పాండెంట్ అయియున్నారు. మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపించినను మీకు చేరనందున శ్రీ కోర్టువారు మీకు నోటీసు నిమిత్తం ప్రజాశక్తి డైలీ పేపరు ప్రకాశం జిల్లా ఎడిషన్లో పబ్లికేషన్ ద్వారా మీకు తెలియపరచుటకు ఆర్డరు వేసినారు. మీరు ఈ ప్రకటనను చూసిన పిదప తేది: 04-10-2023 న వాయిదా అయ్యున్నది ఆ రోజు ఉదయం 10:30 గం.లకు మీరు గానీ, మీ తరఫున లాయరు గానీ కోర్టు వారి ఎదుట హజరై మీకు పై తెలిపిన ఇ.పిలో అభ్యంతరాలు ఉన్న యెడల తెలుపుకోవలెను. అల్లు మీరు హాజరు కాని యెడల మీకు ఎలాంటి అక్షేపణలు లేవని భావించి పై తెలిపిన ఇ.పిను కోర్టువారు మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.

ఒంగోలు
తేది : 08-09-2023 ఇట్లు
పంగులూరి గోవిందయ్య,
పిటిషనరు తరపున న్యాయవాది.
ఒంగోలు

నేటి నుంచి చీరాలలో..

జన విజ్ఞాన వేదిక రాష్ట్ర మహాసభలు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జనవిజ్ఞాన వేదిక 17వ రాష్ట్ర మహాసభలు శని, ఆదివారాల్లో చీరాలలో జరుగనున్నాయి. జన విజ్ఞాన వేదిక ఒక సైన్సు ప్రచార సంస్థ. సైన్స్ ఫలాలను సామాన్య ప్రజలకు అందేటట్లు చూడడం, సమాజంలో శాస్త్రీయ దృక్పథంతో సంబంధం లేకుండా జరుగుతున్న అన్యాయాలను, మూఢ నమ్మకాలను ఎదిరించి సామాన్య ప్రజలను చైతన్యవంతుల్ని చేయడం, ప్రజల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించడమే లక్ష్యంగా జనవిజ్ఞాన వేదిక తన వంతు కృషి చేస్తోంది. ఏ కొద్దిమందికో పరిమితమైన శాస్త్ర విజ్ఞానం, సామాన్య ప్రజలకు సైతం అందేటట్లు చేస్తుంది. వీటితో పాటు సత్యాన్వేషణకు, దేశస్వావలంబనకు, సమగ్రతకు, లౌకికతత్వానికి, ప్రపంచశాంతికి, సామాజికాభివృద్ధికి, సాంస్కృతిక వికాసానికి జన విజ్ఞాన వేదిక నిరంతరం కృషి చేస్తోంది. జీవ వైవిధ్యాన్ని కాపాడటం, పర్యావరణ పరిరక్షణకు పాటుపడటం. కాలుష్యం చిచ్చు రేపుతున్న వాటిని అరికట్టేందుకు కృషి చేయడం చేస్తుంది. మూఢనమ్మకాలకు, సైన్స్‌కు ఉన్న తేడా ఏమిటో విద్యార్థులకు తెలియజేయడం కోసం పాఠశాలల్లో జన విజ్ఞాన వేదిక చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ సంబరాలను ఏటా నిర్వహిస్తోంది. విద్యార్థుల్లో శాస్త్ర పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు జన విజ్ఞాన వేదిక నిర్వహించే వేడుకల్లో వేలాదిమంది విద్యార్థులు పాల్గొంటున్నారు.

ఈ నేపథ్యంలో జన విజ్ఞాన వేదిక 17వ రాష్ట్ర మహాసభలకు చీరాల వేదిక అయింది. పట్టణంలోని ఆర్‌వోబి వద్ద ఉన్న పద్మశాలి కళ్యాణ మండపంలో శని, ఆదివారాల్లో జరుగనున్న రాష్ట్ర మహాసభల్లో ఆల్ ఇండియా పీపుల్ సైన్స్ నెట్వర్క్ జాతీయ సహాయ కార్యదర్శి పిజి గోపీనాథన్ (కేరళ), నెల్లూరు, చిత్తూరు, ప్రకాశం జిల్లాల మాజీ శాసనమండలి సభ్యులు, సీనియర్ జనవిజ్ఞాన వేదిక నాయకులు వి బాల సుబ్రమణ్యం, ప్రముఖ సైంటిస్ట్ ప్రొఫెసర్ రామచంద్రయ్య (నిట్ వరంగల్) ముఖ్య అతిథులుగా పాల్గొంటున్నారని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు రాజశేఖర్ రాహుల్, జి మురళీధర్ తెలిపారు. రెండో రోజు జరిగే కార్యక్రమాలలో కృష్ణ, గుంటూరు జిల్లాల ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణ్ రావు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, తెలంగాణ జెవివి అధ్యక్ష కార్యదర్శులు ప్రొఫెసర్ కోయ వెంకటేశ్వరరావు, టి శ్రీనాథ్ పాల్గొంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల నుంచి 300 మంది ప్రతినిధులు మహాసభలలో పాల్గొంటున్నారని వారు తెలిపారు.

యూనివర్శిటీ పాలకమండలి సభ్యులుగా కొండ్రెడ్డి

ప్రజాశక్తి-పిసిపల్లి

ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులుగా కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం నియమించిందని ఆయన తెలిపారు. మండలంలోని బుడ్డారెడ్డిపల్లికి చెందిన ఆయన సైన్స్ ఉపాధ్యాయులుగా ఉద్యోగ బాధ్యతల్లో చేరి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులుగా, ఎంఇఓగా పని చేసి రిటైర్డ్ అయ్యారు. పదవీ విరమణ అనంతరం సాహిత్యం వైపు మళ్ళారు. రైతు కుటుంబంలో పుట్టిన ఆయన దుక్కిచూపు అనేక దీర్ఘ కవితతో రైతుల సమస్యలపై రచనలు చేశారు. మట్టితడిబంధాలు అనే పేరుతో మానవ సంబంధాల గురించి రచనలు చేశారు. ప్రపంచీకరణంలో రైతు పడే ఇబ్బందులు, రైతులపట్ల పాలకుల నిర్లక్ష్యంను కవిత రూపంలో పాటకుల కళ్ళకు కట్టినట్లు నాగేటి గూడు అనే కవితా సంపుటిని పుస్తకం రూపంలో విడుదల చేశారు. ఈ విధంగా పేరొందిన కొండ్రెడ్డిని మేధావి వర్గంలో యూనివర్శిటి పాలకమండలి సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బుడ్డారెడ్డిపల్లి మరియు పిసిపల్లి మండలంలో ఆయన శిష్యులు, రాజకీయ నాయకులు పలువురు ఆయనకు అభినందనలు తెలిపారు.

రెడీమేడ్ దుకాణం ప్రారంభించిన సానికొమ్ము

ప్రజాశక్తి-పొదిలి

చిన్న బస్టాండ్ సెంటర్లో రాయల్ ఛాయిస్ రెడీమేడ్ షోరూమ్‌ను వైసిపి రాష్ట్ర కార్యదర్శి సానికొమ్ము శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హనీమూన్ శ్రీనివాసరెడ్డి, వైసిపి జిల్లా కార్యదర్శి గొలమారి చెన్నారెడ్డి, క్లాస్ వర్క్ కాంట్రాక్టర్ కల్లం సుబ్బారెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు గుజ్జుల గిరిబాబురెడ్డి, షోరూమ్ అధినేతలు బళ్లారి కాశిరెడ్డి, బూచి వెంకట గోపిరెడ్డి పాల్గొన్నారు.

పదోన్నతిపై వెళ్తున్న ఇఓఆర్‌డి రాజశేఖర్‌రావును ఘనంగా సత్కరిస్తున్న పొదిలి అధికారులు, నాయకులు

రాజశేఖర్‌రావుకు ఘన సన్మానం

ప్రజాశక్తి-పొదిలి

విధి నిర్వహణలో నీతి నిజాయితీ, నిబద్ధతతో పనిచేస్తూ ప్రభుత్వ కార్యక్రమాలను వివిధ శాఖల సమన్వయంతో సమిష్టిగా నిర్వహించడంలో రాజశేఖర్‌రావు దిట్ట అని పలువురు వక్తలు కొనియాడారు. పొదిలి ఈఓఆర్‌డిగా పనిచేస్తూ పదోన్నతిపై లింగసముద్రం ఎంపీడీఓగా వెళ్తున్న కే రాజశేఖర్‌రావు అభినందన సన్మాన సభ శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ శ్రీకృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ ప్రజలు సమాచార హక్కు చట్టాన్ని సద్వినియోగం చేసుకోవడంలో రాజశేఖర్ కృషి అభినందనీయమన్నారు. గతంలో ఇఓఆర్‌డిగా పనిచేసిన మర్రిపూడి మండల అభివృద్ధిలో రాజశేఖర్‌రావు విలువైన సేవలు అందించారని, మర్రిపూడి ఎంపీపీ వాకా వెంకటరెడ్డి అన్నారు. ఆయన సేవలను తాము ఉపయోగించుకోలేకపోవడం బాధగా ఉందని అన్నారు. విధి నిర్వహణలో నిష్పక్షపాతంగా నిజాయితీతో నిర్భయంగా పనిచేసే మనస్తత్వం రాజశేఖర్ సొంతమని అన్నారు. తహశీల్దారు అశోక్ కుమార్ రెడ్డి, జిల్లా ఆహార సలహా సంఘం సభ్యులు కొండ్రగుంట సుబ్బారావు, వ్యవసాయ అధికారి ఎస్‌కె జైనులాబ్దిన్, మాజీ ఎంపీపీ కోవెలకుంట్ల నరసింహారావు, ఎంఇఒ శ్రీనివాసులు, నగర పంచాయతీ కమిషనర్ డేనియల్ జోసఫ్, వైసిపి నగర పంచాయతీ అధ్యక్షురాలు ఎస్‌కె నూర్జహాన్ బేగం, పంచాయతీ కార్యదర్శుల అధ్యక్షురాలు పద్మ మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు రాజశేఖర్ రావును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి, మైనింగ్ అండ్ మినరల్స్ కార్పొరేషన్ డైరెక్టర్ కేవీ రమణారెడ్డి, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జి శ్రీను, క్లాస్ వన్ కాంట్రాక్టర్ కల్లం సుబ్బారెడ్డి, మాజీ ఎఎంసి గుజ్జుల రమణారెడ్డి, మండల ఏఇ ఎస్‌కె మస్తాన్ వలి, మండల వైసిపి అధ్యక్షులు దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి, వైసిపి నాయకులు పేరం కోదండ రామిరెడ్డి, కొండాయపాలెం సర్పంచ్ సన్నెబోయిన మాధవి సుబ్బారావు, అధ్యాపకులు పోలు శ్రీనివాసరెడ్డి, వైసిపి జిల్లా కార్యవర్గ సభ్యులు బండి అశోక్, పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకులు యు శేషగిరిరావు, పలుగ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

బాలుడిపై సైకో ఉపాధ్యాయుడి దాడి

విచారణ చేస్తున్న విద్యాశాఖ అధికారులు

ప్రజాశక్తి-రాచర్ల

రాచర్ల మండలం జెపి చెరువు గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు పేర్ల పరమేశ్వరరెడ్డి పాఠశాలలోని చిన్న పిల్లలను చిత్రహింసలకు గురిచేస్తున్నారు. ఇటీవల 98 డీఎస్సీ కోటాలో ఉద్యోగం పొందిన ఆయన మానసిక రోగి. రెండు నెలల క్రితమే విధుల్లో చేరారు. తొలి రోజు నుంచే చిన్నారులను చిత్రహింసలు పెడుతున్నారని చిన్నారుల ద్వారా తల్లిదండ్రులు తెలుసుకున్నారు. బుధవారం జక్కుల మనోహర్ అనే చిన్నారి బాలుడిని రెండు కర్రలతో గొంతు నొక్కుతుండగా, పిల్లలందరూ గట్టిగా కేకలు వేయడంతో వదిలి పెట్టారు. చిన్నారులు ఆ ఉపాధ్యాయున్ని చూస్తే వణికిపోతున్నారు. విషయం తెలుసుకున్న రాచర్ల ఎంఇఓ పాఠశాలను సందర్శించి విచారణ చేపట్టారు. ఉపాధ్యాయుడ్ని విధులకు హాజరు కాకుండా ఆపుదల చేసి జిల్లా విద్యాశాఖ అధికారికి ఫిర్యాదు పంపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జి రంగనాయకులు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ మధుసూదన్, వీఆర్వో రంగస్వామి పాల్గొన్నారు.

వివాహ వేడుకలో మాజీ ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర

ప్రజాశక్తి-పొదిలి: మండలంలోని మంగంపల్లి గ్రామంలో కనిగిరి నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ నాయకులు రావినూతల కోటయ్య కుమారుడు ప్రతాప్ వివాహ కార్యక్రమానికి కనిగిరి తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గోచిపాతల రవికుమార్ మాదిగ, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సానికొమ్ము తిరుపతిరెడ్డి, వైసిపి సెల్ నాయకులు కటికల వెంకటరత్నం, కత్తి తిరుపాలు, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు తోరేటి ఆనంద్ మాదిగ, కిష్టాపర్ మాదిగ, గాయం రామిరెడ్డి, చీకటి వెంకటసుబ్బయ్య, మురహరి నరసయ్య, మువ్వా రంగ సాయి యాదవ్, ఉప సర్పంచ్ కత్తి కిషోర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు వేల్పుల రాజశేఖర్, సర్పంచ్ పరిశపోగు ఏసు తదితరులు పాల్గొన్నారు.

కనిగిరి యువకునికి అమెరికా డాక్టరేట్

ప్రజాశక్తి-హనుమంతునిపాడు

ప్రకాశం జిల్లా కనిగిరి నియోజకవర్గ పరిధిలోని హనుమంతునిపాడు మండలం కోటతిప్పల గ్రామ నివాసి శుద్ధికట్టు మహావిష్ణు అమెరికాలోని మౌంట్ ఎల్బర్ట్ యూనివర్సిటీ నుంచి రసాయన శాస్త్ర విభాగంలో గౌరవ డాక్టరేట్ పురస్కారం అందుకున్నారు. హైదరాబాదులో నాగోల్ డివిజన్లోని శ్రీ చైతన్య కళాశాలలో కెమిస్ట్రీ సీనియర్ లెక్చరర్‌గా 16 సంవత్సరాల నుంచి పనిచేస్తున్నారు. రసాయన శాస్త్ర విభాగంలో ఆచార్యునిగా విద్యార్థులకు గత 16 సంవత్సరాల నుంచి సేవలందిస్తూ అనేకమంది విద్యార్థుల జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దిన ఘనత శుద్ధికట్టు మహావిష్ణుకు దక్కింది. ఈ సందర్భంగా మహావిష్ణు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో హాస్టల్లో ఉంటూ ఉన్నత శిఖరాలకు చేరాలనే లక్ష్యంతో మొక్కవోని దీక్షతో కష్టపడి చదువుకొని ఈరోజు అమెరికా నుంచి గౌరవ డాక్టరేట్ అందుకోవటం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బడుగు వెంకటేశ్వర్లు సోదరుడు మహా విష్ణువు అమెరికా నుంచి డాక్టర్ గుర్తింపురావడం ఎంతో సంతోషంగా ఉందని ఆనందం వ్యక్తపరుస్తూ అభినందించారు. మహావిష్ణుకు తోటి లెక్చరర్లు, బంధువులు అభినందనలు తెలుపుతున్నారు. మహావిష్ణు ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు ప్రభుత్వ హైస్కూల్ కనిగిరి, ఇంటర్మీడియట్ ఎంఎన్‌ఎం జూనియర్ కాలేజ్ కనిగిరి, శర్మ కాలేజ్ ఒంగోలు, ఎంఎస్సీ (ఆర్గానిక్) ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో చదువుకొని ఉన్నారు.

మృతి చెందిన బాలుడిని పరిశీలిస్తున్న ఎస్ఐ రామకృష్ణ

ప్రైవేటు పాఠశాల బస్సు ఢీకొని బాలుడు మృతి

ప్రజాశక్తి-దరిశి

మండలంలోని కట్టుబడి వారిపాలెం గ్రామంలో స్కూల్ బస్సు తగిలి జగద్గురు సాయి(3) అనే బాలుడు మృతి చెందాడు. ఈ సంఘటన శుక్రవారం జరిగింది. స్థానిక ఎస్ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. కట్టుబడివారిపాలెం గ్రామంలో ప్రతిరోజూ ప్రైవేటు పాఠశాల బస్సు వచ్చి విద్యార్థులను ఎక్కించుకొనిపోతున్న సమయంలో శుక్రవారం కూడా ఆ గ్రామంలో గనెగళ్ల గురుప్రసాద్ పెద్దకుమారుడిని స్కూల్ బస్సు ఎక్కించే క్రమంలో చిన్నకుమారుడు జగద్గురు సాయి కూడా బస్సు ఎక్కుతానని వెనుక వైపు పట్టుకోబోవడంతో బస్సు తగిలి బాలుడు కిందపడ్డాడు. తలకు బలమైన రాయి తగలడంతో అక్కడక్కడే మృతిచెందాడు. మృతుని తండ్రి గురుప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఆయన తెలిపారు. ఎస్ఐ సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పరిశీలించారు.

షాపును పరిశీలిస్తున్న సిఐ కెవి రాఘవేంద్ర

సెల్ ఫోన్ దుకాణంలో చోరీ

- మూడు లక్షల సెల్ ఫోన్లు, రూ.70 వేల నగదు అపహరణ

ప్రజాశక్తి-పొదిలి

పొదిలి పట్టణంలో భారీ చోరీ జరిగింది. పెద్ద బస్టాండ్ సెంటర్ లోని అంబికా సెల్ వరల్డ్ షాపులో 3 లక్షల రూపాయలు విలువచేసే మొబైల్స్, రూ.70,000 నగదు అపహరణకు గురైనట్లు యజమాని రవికుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సబ్ ఇన్‌స్పెక్టర్ కెవి రాఘవేంద్ర సంఘటన స్థలాన్ని సందర్శించి సీసీ కెమెరా పుటేజ్‌ని పరిశీలించారు.

అర్హులందరికీ రుణాలు

ప్రజాశక్తి-పిసిపల్లి: అర్హులందరికీ రుణాలు బ్యాంకుల ద్వారా ఇప్పిస్తామని పిసిపల్లి ఎపిఎం జి.సత్యానందం అన్నారు. శుక్రవారం నూతనంగా విధుల్లో చేరిన ఆయన డ్వాక్రా గ్రూపు గామ సంఘ సహాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా కనిగిరి ఏరియా కోఆర్డినేటర్ కత్తి కళ్యాణ్, డిపిఎం నరసింహారావులు పాల్గొని మాట్లాడారు. గ్రూపు సభ్యులు ప్రతి నెల సమావేశాలు ఏర్పాటు చేయాలని, పుస్తక నిర్వహణ సక్రమంగా చేయాలన్నారు. ఈ సమావేశంలో వెలుగు సిసిలు తిలకమ్మ, శశిరేక, రమణయ్య, భ్రమరాంబ, ఎంఎస్ జి మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

వివాహ వేడుకలో ప్రముఖులు

ప్రజాశక్తి-సిఎస్ పురంరూరల్

మండలంలోని కోవిలంపాడు గ్రామంలో గురువారం రాత్రి జరిగిన గోనువారి వివాహ వేడుకలలో ప్రముఖులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతలచెరువు సత్యనారాయణరెడ్డి, టిడిపి కనిగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, నియోజకవర్గంలోని పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొని నూతన వధూవరులు వినోద్‌రెడ్డి, సుస్మితలకు శుభాకాంక్షలు తెలిపారు.

మోపిదేవికి వినతి పత్రం అందజేస్తున్న దళిత సంఘాల నేతలు

అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించొద్దు

ప్రజాశక్తి - చెరుకుపల్లి : జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా చెరుకుపల్లి అంబేద్కర్ సెంటర్ వద్ద రహదారి మధ్యలో ఉన్న అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించకుండా రెండు వైపులా రహదారి నిర్మించాలని దళిత సంఘాల నాయకులు అధికారులకు, ప్రజా ప్రతినిధులకు వినతి పత్రం అందజేశారు. ఎన్నో సంవత్సరాల క్రితం అప్పటి ప్రభుత్వ అనుమతితో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించడం సమంజసం కాదని పేర్కొన్నారు. విగ్రహాన్ని తొలగించే అవసరం లేకుండా రహదారి నిర్మాణం చేసుకోవచ్చని సూచించారు. అంబేద్కర్ సెంటర్లో శుక్రవారం నిరసన ప్రదర్శన, రాస్తారోకో నిర్వహించారు. అనంతరం అటు వైపు వెళుతున్న రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రమణారావుకు వినతి పత్రం అందజేశారు. అధికారులు, దళిత సంఘాల నాయకులతో జాయింట్ కమిటీ ఏర్పాటు చేసి సానుకూల నిర్ణయం వచ్చేలా చూస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అంబేద్కర్ వాదులు, అంబేద్కర్ యూత్ సభ్యులు, కె శరత్, సిద్దార్థ, సురేష్, ఇస్సాకు, మురళి, చైతన్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రదర్శనగా వెళ్లి తహశీల్దారుకు వినతి పత్రం అందజేశారు.

కాకానిపాలెంలో మూతపడ్డ శుద్ధ జల కేంద్రం

మూతపడ్డ శుద్ధ జల ప్లాంట్

ప్రజాశక్తి - అద్దంకి : పట్టణంలోని కాకానిపాలెం మండపం వద్ద ఎంఎల్ఎ గొట్టిపాటి రవికుమార్ ఆర్థిక సహకారం, దాతలు సహకారంతో సమకూర్చిన రూ.10లక్షల నిధులతో ఏర్పాటు చేసిన శుద్ధ జల ప్లాంట్ గత 30రోజుల నుండి మూత పడింది. దీంతో పట్టణంలోని ఉత్తర అద్దంకి, బొమ్మనంపాడు, చేరువుకొమ్ముపాలెం, కశ్యాపురం గ్రామాల ప్రజలకు తాగునీరు లేక ఎన్నోఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానిక ప్రజలకు తాగు నీరు అందించే శుద్ధ జల వాటర్ ప్లాంట్ పునరుద్ధరించి వాటర్ ప్లాంట్ అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. ఇప్పటికీ పట్టణంలో దాదాపుగా ఐదు రోజుల నుండి నీరు విడుదల లేకపోవడంతో ట్యాంకర్ల సహాయంతో గృహ యజమానులు నీటిని తరలించుకుంటున్నారు.

ఎకో ఇండియా శిక్షణలో చీరాల ఉపాధ్యాయుడు భానుచంద్ర

ఎకో ఇండియా శిక్షణలో 'పవని'

ప్రజాశక్తి - చీరాల : ఢిల్లీకి చెందిన ఎకో ఇండియా, నేషనల్ గ్రీన్ కార్ప్స్ (ఎన్‌జిసి) ఆధ్వర్యంలో రాష్ట్రంలో వ్యాప్తంగా ఎన్‌జిసి సమన్వయకర్తలు, క్లస్టర్ కో ఆర్డినేటర్లకు పర్యావరణంపై రెండు రోజుల శిక్షణ విశాఖ పౌర గ్రంథాలయంలో జరిగింది. కార్యక్రమానికి చీరాల ఉపాధ్యాయుడు బాపట్ల జిల్లా తరపున జిల్లా కో ఆర్డినేటర్గా పవని భానుచంద్రమూర్తి పాల్గొన్నారు. పర్యావరణ హితం కోసం పాఠశాలల్లో నిర్వహించాల్సిన కార్యక్రమాలు, వాటిని అమలు చేయవలసిన విధానాలు గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఆర్‌జెడి జ్యోతి కుమారి, డిప్యూటీ డి గౌరీశంకర్, ఎకో ఇండియా అధినేత దీప్ ఝా, రాష్ట్ర సమన్వయకర్త పి నీలకంఠం, గ్రీన్ క్లైమేట్ వ్యవస్థాపకులు జెవి రత్నం సమక్షంలోశిక్షణ అనంతరం ధృవీకరణ పత్రాలు అందజేశారు.

పోన్నపల్లిలో డాక్టర్ వైఎస్ఆర్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - చెరుకుపల్లి

గ్రామంలో నూతనంగా పునర్నిర్మించిన డాక్టర్ వైఎస్ఆర్ విగ్రహాన్ని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ ఆవిష్కరించారు. గ్రామంలో గడప గడపకు ప్రభుత్వ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. మండల పరిషత్ ఉపాధ్యక్షులు పైనం రంగారెడ్డి, వైసిపి మండల కన్వీనర్ పైనం ఏడుకొండలరెడ్డి ఆధ్వర్యంలో మొదటి రోజు జరిగిన కార్యక్రమంలో నూతనంగా పునః నిర్మించిన డాక్టర్ వైఎస్ఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించి అనంతరం గ్రామంలో పర్యటించారు. ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గడప గడపకు ప్రభుత్వ కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. వాటిని వెంటనే పరిష్కరించేందుకు చక్కటి అవకాశం అని మోపిదేవి అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పైనం బసవ పున్నమ్మ, మాజీ ఎంపిపి చెన్ను కోటేశ్వరరావు, మాజీ సర్పంచ్ ఈపూరి ఏడుకొండలు, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

గడప గడపకు కార్యక్రమంలో ఎంపి మోపిదేవి వెంకటరమణరావు

ఉపాధ్యాయులకు రోటరీ పురస్కారాలు

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా మండలంలోని గంగవరం శ్రీ వలేటి కృష్ణయ్య ఉన్నత పాఠశాలలోని ఉపాధ్యాయులందరిని రోటరీ క్లబ్ తరపున నేషన్ బిల్డర్స్ అవార్డుతో సత్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల పూర్వ విద్యార్థి, పూసపాడు పాఠశాల రిటైర్డ్ పిఇటి ప్రతిపాటి వెంకటేశ్వర్లు పాఠశాలకు ఆయన ఒక నెల పెన్షన్ రూ.50వేలను విరాళంగా అందజేశారు. సభకు పాఠశాల హెచ్ఎం కొర్రపాటి వీరాంజనేయులు అధ్యక్షత వహించారు. రోటరీ అధ్యక్షులు కరి కమలేశ్వరరావు, కార్యదర్శి జెట్టి వెంకటేశ్వర్లు (స్వామి), కోశాధికారి చుండి సాంబశివరావు, డైరెక్టర్లు మద్దినేని హనుమంతరావు, సోమేపల్లి రామమోహనరావు, వంకాయలపాటి శ్రీమన్నారాయణ, సర్పంచ్ బెల్లం సుధాకరరావు, ఎంపిటిసి సభ్యులు మేకల రాజగోపాలరెడ్డి, పాఠశాల వ్యవస్థాపక కుటుంబీకులు వలేటి ఆంజనేయులు, పూసపాడు హిందీ పండిట్ వలేటి సుబ్బాయమ్మ, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవ సభకు పాఠశాల హెచ్ఎం పిడపర్తి పేరి రెడ్డి అధ్యక్షత వహించారు.

ఉపాధ్యాయులకు రోటరీ పురస్కారాలు

సజ్జాపురంలో గడప గడపకూ కృష్ణచైతన్య

ప్రజాశక్తి- సంతమాగులూరు

ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా జగన్మోహన్‌రెడ్డి పరిపాలన చేస్తున్నారని శాప్ నెట్ కార్పొరేషన్ చైర్మన్, వైసిపి కన్వీనర్ బాచిన కృష్ణ చైతన్య అన్నారు. సజ్జాపురంలో 2వ రోజు గడప గడపకు ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్న కుటుంబాలతో మాట్లాడారు. వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది పనితీరును ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేస్తామన్నారు. సంక్షేమ పథకాల ద్వారా లక్షలాది కుటుంబాలకు సిఎం వైఎస్ జగన్ లబ్ధి చేకూరుస్తున్నారని వివరించారు. నాయకులంతా కలిసికట్టుగా పనిచేసి పార్టీ బలోపేతమే లక్ష్యంగా పని చేయాలన్నారు. రానున్న ఎన్నికలలో మళ్లీ వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని గెలిపించాలని కోరారు. జడ్పిటిసి ఆడవి శ్రీనివాసరావు, వైసిపి కన్వీనర్ చింతా రామారావు, మాజీ ఎఎంసి చైర్మన్ బొల్లినేని రామకృష్ణ, నాయకులు తేల్లప్రోలు వెంకట్రావు, సర్పంచి అనంతవరపు మార్తమ్మ పాల్గొన్నారు.

గడప గడపకు కార్యక్రమంలో కృష్ణచైతన్య

15 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష

ప్రజాశక్తి - రేపల్లె

జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపెయిన్ ఈనెల 15నుంచి ప్రారంభమౌతుందని తహసిల్దార్ మల్లికార్జునరావు అన్నారు. తన కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. వలంటీర్లు ఇళ్లను సందర్శించి ప్రజలకు ఆరోగ్యసురక్షపై అవగాహన కల్పించాలన్నారు. యాప్‌లో కుటుంబ ఆరోగ్య వివరాలను నమోదు చేయాలని సూచించారు. ఇంటింటికీ వెళ్లి ఎఎన్ఎం, సీహెచ్‌వో వైద్యాధికారులు సందర్శించే తేదీలను ప్రజలకు తెలియజేయాలని అన్నారు. ఈనెల 30నుంచి నిర్వహించే వైద్య శిబిరాల్లో గ్రామ, పట్టణప్రాంతాల్లో వ్యాధిగ్రస్తులకు మూత్ర, రక్త తదితర వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారన్నారు. అవసరమైతే రెఫరల్ ఆస్పత్రికి పంపి ఆరోగ్యశ్రీ ద్వారా మెరుగైన వైద్యం అందిస్తారని చెప్పారు. స్పెషలిస్ట్ డాక్టర్లు, పీహెచ్‌సీ డాక్టర్లు, ఇతర వైద్య సిబ్బంది ద్వారా చికిత్స, మందులు ఉచితంగా అందించబోతోందని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి విజయసారథి, ఎంపీడీవో కె శివ పార్వతి, ఈఓపిఆర్డీ కెవిస్ మల్లికార్జునరావు, డిప్యూటీ తహశీల్దార సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షపై తహశీల్దారు సమీక్ష

మనోధైర్యంతో ముందుకెళ్లాలి : డాక్టర్ కొండలరావు

ప్రజాశక్తి - చీరాల

ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులు మనోధైర్యంతో ముందుకు సాగాలని ఐకాన్ హాస్పిటల్ ఎండి డాక్టర్ శంకర శెట్టి కొండలరావు అన్నారు. స్థానిక విటల్ నగర్‌లోని చైతన్య మనో వికాస కేంద్రంలో జాతీయ ఫిజియోథెరపి దినోత్సవ వేడుకలు నిర్వహించారు. పలువురు ఫిజియోథెరపిస్టులకు ఆయన చేతులమీదుగా సన్మానం చేశారు. ఆయన మాట్లాడుతూ మానసిక వికలాంగులు శారీరకంగా, మానసికంగా బాగా ఉండేందుకు వారిలో మనోధైర్యాన్ని నింపాలన్నారు. ఫిజియోథెరపిస్ట్ విధానం తో అనేకమంది దివ్యాంగులకు మంచి ఫలితాలు వచ్చాయని గుర్తు చేశారు. క్రమం తప్పకుండా మానసిక దివ్యాంగులచే ఫిజియోథెరపీ చేయించాలన్నారు. స్పీచ్ థెరపీ నిర్వహించడం ద్వారా మానసిక వికలాంగుల్లో మాటలు చెప్పించేందుకు వీలుంటుందని చెప్పారు. తరచూ స్పీచ్‌థెరపీ నిర్వహించాలని సూచించారు. కార్యక్ర మంలో చైర్మన్ ఎన్ వెంకన్నబాబు, ఫిజియోథెరపిస్టులు ఎన్ మాధురి, ప్రసన్న, దివ్య, ఐకాన్ సిబ్బంది పాల్గొన్నారు.

మనోవికాస కేంద్రంలో డాక్టర్ కొండలరావు

పింఛన్ అందజేస్తున్న దృశ్యం

అర్హులందరికీ పింఛన్లు

ప్రజాశక్తి - చీరాల

అర్హత కలిగిన లబ్ధిదారులు అందరికీ పింఛన్లను పంపిణీ చేస్తుందని 5వ వార్డు కౌన్సిలర్ సూరగాని లక్ష్మీ అన్నారు. పేరాల సచివాలయంలో నూతన పింఛన్లకు అర్హులైన గార్లపాటి సుబ్బులు, కొల్లిపర రామ మోహనరావు లబ్ధిదారులకు ఆమె పెన్షన్లను శుక్రవారం అందజేశారు. అర్హులైన లబ్దిదారులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆమె వెంట మహిళా పోలీస్ కె అనిత, వాలంటీర్లు జి కేదర్నాథ్, ఏ కీర్తి, యు చిరంజీవి పాల్గొన్నారు.

సిపిఆర్‌పై అవగాహన కల్పిస్తున్న బాబురావు

సిపిఆర్‌పై అవగాహన

ప్రజాశక్తి - చీరాల

గుండెపోటు వచ్చిన వ్యక్తికి చికిత్స అందించే సిపిఆర్ పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని గుండె వైద్య నిపుణులు డాక్టర్ ఐ బాబురావు అన్నారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సిపిఆర్‌పై శుక్రవారం అవగాహన కల్పించారు. గుండెపోటు వచ్చి మనిషి పడిపోయిన సమయంలో అంబులెన్స్ వచ్చే వ్యవధిలో అందించే సిపిఆర్ ప్రథమ చికిత్స ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. సిపిఆర్ విధానం పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు డెమో చూపించారు. వ్యాయామం తప్పనిసరిగా చేయాలని సూచించారు. ఆహారం పట్లపలు జాగ్రత్తలు పాటించాలని అన్నారు. కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు మామిడాల శ్రీనివాస రావు, పోలుదాసు రామకృష్ణ, ప్రిన్సిపాల్ రమణమ్మ, సౌభాగ్య లక్ష్మి పాల్గొన్నారు.

అంగనవాడీ కార్యకర్తలతో కోడూరినాగజ్యోతి

పోషకాహారంతో ఆరోగ్యం

ప్రజాశక్తి - చీరాల

అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీ, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న పౌష్టిక ఆహారం తీసుకోవడం వలన ఆరోగ్యంగా ఉంటారని మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు కోడూరు నాగజ్యోతి అన్నారు. పట్టణంలోని ప్రకాష్ నగర్ 25వ వార్డు అంగనవాడీ కేంద్రంలో పౌష్టిక ఆహారంపై వార్డు ప్రజలకు అవగాహన కల్పిస్తూ శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. సెక్టార్ సూపర్వైజర్ బి కుముద్వతి తల్లిపాల ప్రాముఖ్యత వివరించారు. పౌష్టికాహారం బిడ్డలకు ఇవ్వాలన్నారు. గర్భవంతులు సకాలంలో మంచి ఆహారం తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో కె తిరుమలదేవి, ఆశా వర్కర్లు పి పద్మ, ఎస్‌కె ఖరీమును, కె తులసి, అంగన్వాడీ కార్యకర్తలు టి వనజకుమారి, ఎం సుజాత, పి యేసుదేవి, డి శివ నాగమ్మ కె రేవతి పాల్గొన్నారు.

ప్రజాశక్తి 5
శనివారం 9 సెప్టెంబరు 2023

ఆక్రమణలో త్రిపురాంతకం చెరువు

చెరువు విస్తీర్ణం 430 ఎకరాలు.. ఆక్రమణకు గురైంది 100 ఎకరాలు ● చుక్క నీరు రాని వైనం ● ఇటుక బట్టీలకు కల్పతరువుగా మారిన చెరువు ● పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-త్రిపురాంతకం

త్రిపురాంతకం చెరువు యర్రగొండపాలెం నియోజకవర్గంలోనే పెద్దది. దాని విస్తీర్ణం 430 ఎకరాలు. 2005 వరకు త్రిపురాంతకం చెరువు ఆలనా పాలనా బాగుండేది. చెరువు నిండితే మిట్టపాలెం, రామసముద్రం, త్రిపురాంతకం బోర్లలో భూగర్భ జలమట్టం పెరగడంతో పాటు త్రిపురాంతకం, రాజుపాలెం గ్రామాల్లోని వెయ్యి ఎకరాల భూమి ఆ చెరువు ఆయకట్టు భూమిగా వరి పంటను పండించేవారు. 2005వ సంవత్సరంలో ఒకసారి చెరువు నిండింది. అప్పటి నుంచి ఆ చెరువుకు నీరు రావడమే కరువైంది.

వంద ఎకరాల ఆక్రమణ..

త్రిపురాంతకం చెరువు విస్తీర్ణం 430 ఎకరాలు కాగా ఆక్రమణదారులు వంద ఎకరాలను ఆక్రమించుకొని పంటలను పండించుకుంటున్నారు. సుమారు 20 సంవత్సరాలుగా ఆక్రమణదారుల కబంద హస్తాల్లో వంద

చిల్లచెట్లతో మూసుకుపోయిన కెనాల్

త్రిపురాంతకం చెరువు

ఎకరాల భూమి ఉన్నప్పటికీ పట్టించుకునే నాథుడే కరువయ్యారు. అధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో ఆక్రమణదారులు మూడు పువ్వులు, ఆరు కాయలు అన్న చందంగా కొందరు సాగు చేసుకుంటుండగా, మరికొందరు సొంత భూమిలా విక్రయాలు కూడా చేస్తున్నారు.

ఇటుకల బట్టీలు ఏర్పాటు చేసి..

చెరువుకు నీరు రావడం లేదనే సాకు చూపుతూ ఏకంగా ఇటుకల బట్టీలను ఏర్పాటు చేసి చెరువులోనే ఇటుకలను కాల్చడం, విక్రయించడం చేస్తున్న క్రమంలో అప్పటి జాయింట్ కలెక్టర్‌గా వచ్చిన లక్ష్మీ నరసింహం ఇటుకల బట్టీలను చెరువులో నుంచి ఖాళీ చేయించారు. అయితే ఆయన బదిలీ అయిన వెంటనే తిరిగి చెరువు పక్కనే ఇటుకల బట్టీలను ఏర్పాటు చేసుకొని చెరువులో మట్టితో ఇటుకలు తయారు చేస్తున్నారు. ఈ ప్రాంత ఇటుకలకు డిమాండ్ అధికంగా ఉండడంతో ఇటుకల వ్యాపారం బాగా జరుగుతోంది. ఇప్పటికి 15 ఇటుకల బట్టీలు అక్కడ దర్శనం ఇస్తున్నాయి.

ఆక్రమణదారులపై చర్యలేవీ..

సుమారు వంద ఎకరాల భూమిని ఆక్రమించుకొని చెరువుకు చుక్కనీరు చేరకుండా చేస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడం పట్ల తీవ్ర

ఇటుక బట్టీల కోసం తోలిన మట్టి

విమర్శలు వినిపిస్తున్నాయి. సప్లై చానళ్లు పూడిపోయాయి. కాలువలు మరమ్మతులకు గురయ్యాయి. చెరువుకు నీరు వచ్చే చాపలమడుగు, చెన్నంపల్లి, మిట్టంపాలెం, రామసముద్రం, త్రిపురాంతకం కాలువలు మరమ్మతులకు గురయ్యాయి. చిల్లచెట్లు పెరిగి అడవిని తలపిస్తున్నాయి. దీంతో సుమారు ఐదు వేల బోర్లలో భూగర్భ జలమట్టం పెరగడంతో పాటు వెయ్యి ఎకరాల ఆయకట్టు భూమి పంటలు పండే చెరువుపై అశ్రద్ధ చేయడం పట్ల తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. చెరువుకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి: గొట్టిముక్కల రాజారామయ్య, సిపిఎం మండల కార్యదర్శి, త్రిపురాంతకం

చెరువు భూమిని ఆక్రమించుకొని సాగు చేసుకుంటున్న ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి. చెరువుకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేసి అభివృద్ధి పరచాలి. ఆయకట్టు భూమిలో పంటలు పండేలా కృషి చేయాలి. చెరువు నిండితే చుట్టు పక్కల నాలుగు గ్రామాల రైతులకు, పశు పోషకులకు ఉపయోగకరంగా ఉంటుంది.

అక్షరాస్యతతోనే అభివృద్ధి

మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్

ప్రజాశక్తి-కనిగిరి

మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్

అక్షరాస్యతతోనే సుస్థిరాభివృద్ధి కలుగుతుందని మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ అన్నారు. కనిగిరి పట్టణ పరిధిలో 11వ వార్డు కాశిరెడ్డి గిరిజన కాలనీలో మండల న్యాయ సేవాధికార సంస్థ, ప్రకాశం జిల్లా ఎస్‌బిసిసి కమిటీ, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ అక్షరం అనే జ్యోతి జీవితం అనే దీపాన్ని వెలిగిస్తుందన్నారు. దేశం అభివృద్ధి చెందాలంటే అందరూ అక్షరాస్యులు కావాలని కోరుతూ యునెస్కో 1966 నుంచి ప్రతి ఏటా సెప్టెంబర్ 8న అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని జరుపుకోవాలని నిర్ణయించిట్లు తెలిపారు. అక్షరాస్యతను పెంచడం, వయోజన విద్యను ప్రోత్సహించడం, పేదరికాన్ని నిర్మూలించడానికి అధిక జనాభా తగ్గించడానికి, లింగ వివక్షతను నిర్మూలించడానికి అక్షరాస్యత ఎంతో అవసరమన్నారు. అక్షరాస్యత అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తున్న పథకాల గురించి వివరించారు. ఎస్‌బిసిసి జిల్లా కోఆర్డినేటర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ అక్షరాస్యుడైన వ్యక్తి తదుపరి అభ్యాసం, విద్యను వ్యాప్తి చేయడానికి ఉత్తమ మార్గం అని అన్నారు. ఒక అక్షరాస్యుడు తన పిల్లవాడిని విద్యను అభ్యసించడానికి ఖచ్చితంగా పంపుతాడని తెలిపారు. అనంతరం పిల్లలకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పారా లీగల్ వాలంటీర్ ఎస్‌బిసిసి జిల్లా సభ్యులు గుడ్ హెల్ప్ ప్రతినిధి రమేష్‌బాబు, జిఎస్ అండ్ జిడికె ఫౌండేషన్ కోఆర్డినేటర్ నవకుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు అనూష, ఝాన్సీ, చంద్రలీలమ్మ పాల్గొన్నారు.

సిఎస్ పురంరూరల్:

నూరు శాతం అక్షరాస్యత సాధించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఈ లక్ష్యసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంఇఒ రాజాల కొండారెడ్డి తెలిపారు. మండలంలోని కె అగ్రహారం, ఆర్కేపల్లి పాఠశాలలో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ చదవడం, రాయడం అనే సామర్థ్యాలు పెంపొందించుకున్న వారంతా అక్షరాస్యులేనన్నారు. అక్షరాస్యత పెంపొందించడం ద్వారా మెరుగైన జీవన ప్రమాణాలు, ఆరోగ్యం, సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కంభాలపాడులో గడప గడపకూ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి

ప్రభుత్వ పథకాలతో లబ్ధి పొందాలి

మార్కాపురం ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి

ప్రజాశక్తి-పొదిలి

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ప్రతి ఒక్కరూ లబ్ధి పొందాలని మార్కాపురం శాసనసభ్యులు కుందురు నాగార్జునరెడ్డి అన్నారు. శుక్రవారం నగర పంచాయతీ పరిధిలోని కంభాలపాడు గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాలను వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందాలనే సదుద్దేశంతో ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. పేదవాడి సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ఈ సందర్భంగా ఆయనకు వైసిపి నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మర్రిపూడి ఎంపిపి వాకా వెంకటరెడ్డి, మాజీ ఎంపిపి కోవెలకంట్ల నరసింహారావు, వైసిపి మండల, నగర అధ్యక్షులు దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి, ఎస్‌కె నూర్జాహాన్ బేగం, మాజీ సర్పంచ్, నగర పంచాయతీ బిసిసెల్ అధ్యక్షులు పులగొర్ల శ్రీనివాసులు, ఎస్‌సి సెల్ అధ్యక్షులు మల్లాపురం చిన నరసింహులు, నగర పంచాయతీ కమిషనర్ ఎస్‌కె డానియల్ జోసఫ్, గ్రామ నాయకులు నాగిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, తల్లపురెడ్డి వెంకట నారాయణరెడ్డి, సిసికెఆర్ శ్రీనివాసరెడ్డి, గ్రామ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మంచినీటి ఎద్దడిపై మొక్కుబడి హామీ..

గ్రామంలో మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని గ్రామ మహిళలు ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. సాగర్ మంచినీరు రాక సుమారు 15 రోజులు పైబడిందని తెలిపారు. వర్షాలులేక వేసవిని తలపిస్తున్న ఎండలతో నీటి సమస్య వేధిస్తోందని వివరించగా ఆయన పరిశీలిస్తానంటూ దాటవేత ధోరణిలో సమాధానం ఇచ్చినట్లు కొందరు గ్రామస్తులు వివరించారు.

10న ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-దరిశి

డాక్టరు మునగా నరసింహారావు ఆధ్వర్యంలో మునగా కోటిరత్నం ఫౌండేషన్ తరపున డాక్టరు మునగా అనిల్ ఈ నెల 10వ తేదీన ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేసి రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నట్లు మునగా నరసింహారావు తెలిపారు. ఈ సందర్భంగా పొదిలి రోడ్‌లోని పిజిఎన్ కాంప్లెక్స్ కళ్యాణ మండపంలో ఆదివారం ఉదయం 10 గంటలకు వైద్యశిబిరం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ వైద్యశిబిరంలో వైద్యనిపుణులు డాక్టరు సుమన్, గీతాపద్మ, నీలి ఆసీస్, షమ్మీ, మునగా సునీల్‌కుమార్, కుప్పం నీరజ్‌కుమార్, మునగా అనిల్ వైద్యపరీక్షలు చేస్తారని ఆయన తెలిపారు. అన్ని వ్యాధులకు పరీక్షలు జరిపి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని, ఈ అవకాశాన్ని దరిశి ప్రాంత ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు.

ఆర్థిక సహకారం అందించిన వరకుమార్‌ను అభినందిస్తున్న స్నేహ హస్తం సభ్యులు

సేవా గుణాన్ని అలవర్చుకోవాలి

ప్రజాశక్తి-కనిగిరి

ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని అలవర్చుకోవాలని స్నేహ హస్తం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సుధీర్‌బాబు తెలిపారు. ఎటువంటి ఆధారం లేని కనిగిరికి చెందిన శ్రీను అనే వ్యక్తి అనారోగ్యానికి గురై ఇబ్బంది పడుతున్న విషయాన్ని శ్రీనివాస థియేటర్ ఆపరేటర్ వరకుమార్ స్నేహ హస్తం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సుధీర్‌బాబు దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఆయన కనిగిరి వైద్యశాలకు తరలించగా హాస్పిటల్ సూపరింటెండెంట్ అబ్దుల్ కలాం వైద్య సేవలు అందించారు. వైద్య సేవల కోసం వరకుమార్ 3000 ఆర్థిక సాయం శ్రీనుకు అందజేశారు. గిద్దలూరు ఫ్యూచర్ హెల్పింగ్ చారిటబుల్ రాజశేఖర్ అక్కడి హోమ్‌కు తరలించారు. ఈ సందర్భంగా స్థానికులు శ్రీనుకు సహకారం అందించిన వారికి అభినందనలు తెలిపారు.

ఆలయ ప్రతిష్టలో పాల్గొన్న ప్రముఖులు

నిదానంపాటి శ్రీలక్ష్మి అమ్మవారి ప్రతిష్ట

ప్రజాశక్తి-దరిశి: మండలంలోని తూర్పువీరాయపాలెంలో నిదానంపాటి శ్రీలక్ష్మి అమ్మవారి ప్రతిష్ట కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే డాక్టరు మద్దిశెట్టి వేణుగోపాల్ సోదరుడు మద్దిశెట్టి శ్రీధర్‌తో పాటు పలువురు వైసిపి నాయకులు ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. అనంతరం ఆయన అన్నదానం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

ఓటరు వెరిఫికేషన్ పూర్తిచేయాలి: ఆర్‌డిఒ

ప్రజాశక్తి-పొదిలి

మండలంలోని అన్ని గ్రామాలలో ఓటరు వెరిఫికేషన్ పూర్తి చేయాలని మండల అధికారులకు, సచివాలయ సిబ్బందికి కనిగిరి రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ అజయ్ కుమార్ సూచించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల లోని ఓటరు జాబితాలో కొన్ని ఓటర్లు ఎక్కువగా నమోదయ్యాయని, వాటిని గుర్తించి తొలగించే ప్రక్రియ పూర్తి చేయాలని శుక్రవారం నాడు మండల అభివృద్ధి అధికారి కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో అధికారులకు ఆదేశాలిచ్చారు. తదనంతరం హనుమంతుని పాడు మండల కేంద్ర గ్రామ సచివాలయాన్ని కనిగిరి రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ అజయ్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయంలో ఎవరూ లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. పలు రికార్డులను పరిశీలించారు.

తహశీల్దారు కార్యాలయంలో వినతి పత్రం ఇస్తున్న సిపిఎం

రేషన్ సరుకులు అందజేయాలని వినతి

ప్రజాశక్తి - అమృతలూరు

నిత్యావసర సరుకులు ప్రజా పంపిణి వ్యవస్థ ద్వారా అందించాలని సిపిఎం కార్యదర్శి బి అగస్టిన్ డిమాండ్ చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో అమృతలూరు డిప్యూటీ తాసిల్దార్ ఎం శివయ్యకు శుక్రవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా అగస్టిన్ మాట్లాడుతూ బయట మార్కెట్‌లో అహార సరుకుల ధరలు మండి పోతున్నాయని, పేదలే కాకుండా మధ్య తరగతి ప్రజలు సైతం కొనలేని విధంగా రేట్లు పెరిగాయని అన్నారు.కందిపప్పు రూ.160 లు, చింత పండు రూ.250, మిర్చి రూ.280, మినపప్పు రూ.130లు ఉందని అన్నారు. అన్ని రకాల సరుకుల ధరలు పెరిగి పోతే పేదలు ఎలా బ్రతకాలని ప్రశ్నించారు. ప్రభుత్వాలు పెరిగే ధరలను అదుపు చేయాలని కోరారు. రేషన్ దుకాణాల్లో బియ్యం, పంచదారతోపాటు అన్ని నిత్యవసర సరుకులు తక్కువ ధరకే పేదలకు ఇవ్వాలని కోరారు. ప్రజాపంణీ వ్యవస్థను పటిష్టం చేయాలని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి రాజు, చావలి రమేష్, కె శాంసన్, అమృతరావు, ముల్పూరు సతీష్ పాల్గొన్నారు.

ఫోర్జరీతో ఘరానా మోసం

ప్రజాశక్తి - బాపట్ల

సుద్దపల్లి కమలాకర్

ఫోర్జరీ సంతకాలతో ఘరానా మోసానికి పాల్పడిన ముగ్గురు వ్యక్తులపై కర్లపాలెంకు చెందిన సుద్ధపల్లి రాజ్యలక్ష్మి భర్త సుద్దపల్లి కమలాకర్ బాపట్ల జిల్లా ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం ఫర్యాదు చేశారు. తమ భార్యకు పూర్వీకుల నుండి సంక్రమించిన 16సెంట్లు ఆస్తిని ఇమ్మడిశెట్టి సురేష్‌బాబు, ఇమ్మడిశెట్టి సీతారావమ్మ, మంతెన లక్ష్మీపతి రాజు తన భార్యకు చెందిన స్థలంపై నకిలీ పత్రాలు సృష్టించి, ఫోర్జరీ చేసి రూ.100 స్టాంపు పేపర్‌పై వారికి అనుకూలమైన వారి పేర్లతో రిజిస్ట్రేషన్ చేయించారని పేర్కొన్నారు. విషయమై బాపట్ల సబ్ రిజిస్ట్రార్‌ను సమాచార హక్కు ద్వారా వివరాలు కోరామని తెలిపారు. తమ స్థలంపై తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించినట్లు నిర్ధారణ అయిందన్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. బాపట్లకు చెందిన న్యాయవాది ఇమ్మడిశెట్టి సురేష్ ఈ ఫోర్జరీ ఘరానా మోసానికి సూత్రధారని తెలిపారు. అది గాక తన భార్యను, తనను ఫోన్ ద్వారా బెదిరిస్తూ మానసికంగా హింసకు గురి చేస్తున్నారని తెలిపారు. సంబంధిత అధికారులు సమగ్ర విచారణ జరిపి తనకు, తన కుటుంబానికి న్యాయంచేయాలని ఎస్పీకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నట్లు కమలాకర్ తెలిపారు.

షాపుల వద్ద ధరల పట్టిక పెట్టాలి

ప్రజాశక్తి - వేటపాలెం

బియ్యం కొనుగోలుదారులకు ధరలకు తగ్గ నాణ్యమైన బియ్యం అందించాలని సివిల్ సప్లై ఎన్ఫోర్స్మెంట్ డీటీ ఓంకారం సూచించారు. స్థానిక గడియార స్తంభం సెంటర్లోని బియ్యం విక్రయ కేంద్రాల వద్ద ఆయన శుక్రవారం విచారణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పందన ఆన్లైన్ ఫిర్యాదు మేరకు విచారణ నిమిత్తం వచ్చినట్లు తెలిపారు. బియ్యం షాపుల యజమానులతో సమావేశమయ్యారు. బియ్యం రకాలు, వాటి ధరలు పట్టికలను షాపుల ముందు ఉంచాలని సూచించారు. వివిధ షాపుల్లోని బియ్యం నాణ్యతలను గుర్తించేందుకు శాంపిల్స్ సేకరించామన్నారు. ఎలాంటి అవకతవకలకు పాల్పడినా చట్టపరిధిలో చర్యలు ఉంటాయని హెచ్చరించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో రేపల్లె ఎన్ఫోర్స్మెంట్ డిటి తోట నిరంజన్ పాల్గొన్నారు.

చిట్టీలు, రుణాలతో పేదలను ముంచిన ఘనులు

మహిళల పేరుతో రూ.72 లక్షలు స్వాహా

ప్రజాశక్తి - రేపల్లె

ఆశ చూపి మోసం చేసే కేటుగాళ్లకు కొదవ లేదు. అలాంటి మోసమే పట్టణంలో చోటు చేసుకుంది. పొదుపు సంఘాల మహిళల పేరుతో రూ.72లక్షలకు మెప్మా సిబ్బంది టోపీ పెట్టారు. మెప్మా కార్యాలయంలో అవినీతి మీద జరుగుతున్న చర్చల్లో కొత్త కోణం వెలుగు చూసింది. గత ఐదు నెలలుగా అవినీతి జరిగిందని అధికారులకు తెలిసినా తెలియనట్లే ఉన్నారు. మోసపోయిన మహిళల మీద బ్యాంకర్ల ఒత్తిడి ఎక్కువ కావడంతో చేసేదేమీ లేక సిపిఎం పట్టణ కార్యదర్శి సిహెచ్ మణిలాల్‌ను మహిళలు ఆశ్రయించారు. మోసపోయిన మహిళలను కలుపుకొని మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించాఆరు. ప్రజా ప్రతినిధులకు వినతి పత్రాల ద్వారా బాధిత మహిళల సమస్యలను వివరించారు. మండలంలోని బేతపూడి పంచాయితీ జాషువా నగర్‌కు చెందిన కె సువార్త కుమారి చిట్టీ పాటలు నిర్వహించేది. చిట్టీలు కట్టని వారిపై అనేక పర్యాయాలు దాడులకు పాల్పడిన ఘటనలు మెండుగా ఉన్నాయి. ఈమె అమాయకులపై భౌతిక దాడులు చేయడంతో కొంతమంది ఊరు వదిలి వెళ్ళిపోయారు. ఈ నేపథ్యంలో చిటీ పాటలు వేసి ఈ ప్రాంత ప్రజలను నమ్మించి నిలువునా ముంచింది. చీట్టీల పేరుతో సుమారు రూ. కోటి వరకు ఎత్తి ఐపి పెట్టింది. తను ఇబ్బందుల్లో ఉన్నానని మాయమాటలు చెప్పి 21వ వార్డు యానిమేటరు మున్నీని తాను కట్టుకుంటానని నమ్మించింది. మెప్మాలో నకిలీ గ్రూపులకు తెరతీసింది. తొలుత తనకు సన్నిహితంగా ఉన్న నిరక్షరాస్యులైన పేద మహిళలను గ్రూపుగా ఏర్పాటు చేసింది. గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో అప్సానా మహిళ సంఘం పేరుతో రూ.10లక్షలు షాహీన గ్రూపు పేరుతో రూ.10లక్షలు, రోషిణి గ్రూపు పేరుతో రూ. 6లక్షలు, అప్సరా గ్రూపు పేరుతో రూ.4లక్షలు తొలి విడతగా రుణాలు తీసుకుంది. తరువాత అవే పేరుతో కెనరా బ్యాంకులో రూ.8లక్షలు, బ్యాంకు ఆఫ్ బరోడాలో రూ.3.5లక్షలు, హెడిఎఫ్‌సిలో రూ.2.5లక్షలు రుణాలు తీసుకుంది. ఫాతీమ గ్రూపు పేరుతో బ్యాంకు ఆఫ్ ఇండియాలో రూ. 4లక్షలు, ఎస్‌బిఐలో రామకృష్ణ గ్రూపు పేరుతో రూ.10లక్షలు, కెనరా బ్యాంకులో కరీముల్లా గ్రూపు పేరుతో రూ.9లక్షలు, సాబీర గ్రూపుతో రూ.5లక్షలు తీసుకుంది. బ్యాంకుల వారు రుణాలు తీసుకున్న వారికి నోటీసులు పంపటంతో మహిళలు రోడ్డు ఎక్కారు. సువార్తకు రుణాలు ఇప్పించిన యానిమేటర్ మున్నీ పలుమార్లు రుణాలు చెల్లించాలని అడిగటంతో మున్నీపై గొడవకు పూనుకుంది. తనపేరు బయటకు వస్తే అంతుచూస్తాని బెదిరింపులకు పాల్పడుతుందని భాదితులు వాపోతున్నారు. మున్నీపై నలువైపులా వత్తిడి పెరగటంతో ఆమె ఊరు వదిలి వెళ్ళింది. పేద మహిళల పేరుతో అక్రమ రుణాలు తీసుకుని మోసం చేసి పారిపోయిన మెప్మా ఆర్పీ, అప్పటి సిబ్బందిపై, ఆర్పీ కుటుంబ సభ్యులుపై పట్టణ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళాసంఘం, సిపిఎం రేపల్లె పట్టణ కార్యదర్శి సిహెచ్ మణిలాల్ ఆధ్వర్యంలో రేపల్లె పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్సై అబ్దుల్ రజాక్‌ను మోసపోయిన డ్వాక్రా గ్రూపు సభ్యులందరూ కలిసి ఉమ్మడిగా కోరారు. ఈ నేపథ్యంలో మున్నీని అడ్డుపెట్టుకుని బ్యాంకులను అడ్డంగా దోచిన సువార్తపైన కేసు నమోదు చేయాలని పలువురు గ్రూపు సభ్యులు డిమాండ్ చేశారు. సువార్త మాయ మాటలు చెప్పి రూ.5వేలు రుణాలు ఉచితంగా ఇప్పిస్తానని మోసం చేసిందని బాధిత మహిళలు వాపోతున్నారు. ఇప్పటి కైనా అధికారులు స్పందించి మోసం చేసిన వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తే కొంత మేర బ్యాంకు రుణాలు జమ చేయవచ్చని బాధిత మహిళలు తెలిపారు.

మెప్మా అవినీతిపై ఫిర్యాదు చేస్తున్న బాధిత మహిళలు

ఇళ్లను చుట్టుముట్టిన మురుగునీరు

ఇబ్బందుల్లో ప్రజలు

ప్రజాశక్తి - బట్టిప్రోలు

స్థానిక ఎనిమిదవ వార్డులో మురుగు నీరు బయటికి వెళ్లే మార్గం లేదు. గృహాలను మురుగు నీరు చుట్టు ముట్టడంతో ప్రజలు నానా అవస్థలు ఎదుర్కొంటున్నారు. తమ సమస్యను గ్రామస్తులు గడప గడపకు పర్యటిస్తున్న మంత్రి నాగార్జున దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన మంత్రి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో డిపిఒ డి రాంబాబు, రేపల్లె ఆర్డిఓ జగన్నాథం పార్థసారధి విడివిడిగా పరిశీలించారు. నీటిని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొంత మంది ఇళ్లకు తాళాలు వేసి బయట అద్దెకు వెళ్లిన వైనం కూడా వెలుగు చూసింది. ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా డ్రైన్ నిర్మాణంకు రూ.60లక్షలు నిధులు మంజూరు చేసిందని, వాటితో మురుగు నీటిని తొలగించే చర్యలు చేపట్టాలన్నారు. వర్షాలతో పాటు పక్కనే ఉన్న వెల్లటూరు ఛానల్ కాలువ కూడా ఉధృతంగా ప్రవహిస్తుండడంతో కాలనీకి ఊట నీరు దిగి ముంపుకు కారణమ వుతుందని అధికారులు గుర్తించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దారా రవి కిరణ్మయి, ఆర్డబ్ల్యూఎస్ డీఈ వేణు గోపాల్, పిఆర్ ఏఈ రామచంద్రరావు, తహశీల్దారు డి వెంకటేశ్వరరావు, ఎంపీడీవో గుమ్మ చంద్రశేఖర్, ఈవో పిఆర్ డి ఊహారాణి, కార్యదర్శి కోట శ్రీనివాసరావు, నాయకులు చెన్నయ్య, భూషణరావు ఉన్నారు.

మురుగు సమస్యను చూస్తున్న అధికారులు

రూ.కోట్లు నొక్కేసి... నాసిరకం పనులు

ప్రజాశక్తి - బాపట్ల

పదేళ్ళలో పెరిగిన బాపట్ల జనాభాకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించడంలో ఎమ్మెల్యే కోన రఘుపతి విఫలమ య్యారని టిడిపి ఇన్‌ఛార్జి వేగేశన నరేంద్ర వర్మ ఆరోపించారు. టిడిపి భవిష్యత్తుకు గ్యారెంటీ, మ్యానిఫెస్టో కరపత్రాలు, మహిళలకు చీరలను స్థానిక 1వ వార్డు రామకృష్ణాపురంలో పంపిణీ చేశారు. ఈసందర్భంగా నరేంద్ర వర్మ మాట్లాడుతూ పేరుకే జిల్లా కేంద్రమని, అందుకు తగ్గట్టుగా అభివృద్ధి మాత్రం లేదని అన్నారు. రోడ్ల మరమ్మతుల పేరుతో కోట్లాది రూపాయల కాంట్రాక్టులు పొంది వైసీపీ నాయకులు నాసిరకంగా పనులు చేస్తున్నారని ఆరోపించారు. టిడిపి ప్రభుత్వంలో మహిళల ఆర్థికాభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలు, డ్వాక్రా రుణాలు అమలు చేశామని పేర్కొన్నారు. తిరిగి టిడిపి అధికారంలోకి వచ్చాక మహిళా శక్తితో మహిళల జీవితాల్లో వెలుగులు నింపుతామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తాతా జయప్రకాష్ నారాయణ, టిడిపి పట్టణ అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు, అంకాల శ్రీనివాసరావు, సందు సాంబశివరావు, సోముల ప్రసాద్, నాయకులు ఫరీద్ మస్తాన్, మందపాటి ఆంద్రేయ, బొడ్డు గోవిందు, కాలింత దిలీప్ పాల్గొన్నారు.

మహిళలకు చీరలు పంచుతున్న వర్మ

రేషన్ అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

ప్రజశక్తి - చీరాల

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పంపిణీ బియ్యంలో దుకాణదారులు అక్రమాలకు పాల్పడితే షాపు నిర్వాహకులు, దళారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎన్ఫోర్స్మెంట్ డిటి ఆర్ శరత్ అన్నారు. పట్టణంలోని పలు రేషన్ షాపులను శుక్రవారం తన సిబ్బందితో కలసి తనిఖీ చేశారు. పట్టణంలోని 11, 12రేషన్ దుకాణాలు, పేరాలలోని 17, 9, 6రేషన్ దుకాణాలతో పాటు పలు దుకాణాలలో తనికీలు చేశామని అన్నారు. షాపులకు సంబంధించిన పలు రికార్డులను ఆయన పరిశీలించారు. వీఆర్వోల ద్వారా వారి పరిధిలో ఉన్న రేషన్ షాపులపై ఎప్పటికప్పుడు ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేశామని తెలిపారు. రేషన్ బియ్యం విషయంలో ఎలాంటి అక్రమాలు జరుగుతున్నట్లు స్థానికులు గుర్తిస్తే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

నైపుణ్యం పెంచుకోవాలి

ప్రజాశక్తి - వేటపాలెం

పరిశ్రమల అవసరాలకు తగిన విధంగా విద్యార్థులు నైపుణ్యం అభివృద్ధి చేసుకోవాలని కాప్ జెమిని సీనియర్ అసోసియేట్ పివి సురేష్‌బాబు తెలిపారు. ఎంబిఎ విద్యార్థులకు శాప్ మాడ్యూల్స్ పై ఆయన అతిధి ఉపన్యాసం చేశారు. ఎంబిఎ విద్యార్థులతో మాట్లాడుతూ నైపుణ్యం అభివృద్ధి చేసుకుంటే ఉన్నత ఉద్యోగ అవకాశాలు పొందవచ్చని అన్నారు. కళాశాల సెక్రటరి వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ ఎస్ లక్ష్మణరావు, ఎంబిఎ హెచ్ఒడి ఆర్ ఇమ్మానియేల్, ఎస్ చాంద్‌బాషా పాల్గొన్నారు.

అవార్డు అందుకున్న ఇజ్రాయేలు

భారత్ శిక్షా గౌరవ్ పురస్కార్ అవార్డు

ప్రజాశక్తి - వేటపాలెం

సెయింట్ ఆన్స్ ఫార్మసి కళాశాల అధ్యాపకుడు డి సాంసన్ ఇజ్రయేల్ జాతీయ స్థాయి ఆవార్డు సాధించినట్లు కళాశాల సెక్రటరి వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ ఎస్ లక్ష్మణరావు తెలిపారు. న్యూఢిల్లీ కెటికె అవుట్ స్టాండింగ్ అచీవర్స్ అండ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ సంస్థ ఇటీవల ప్రకటించిన జాతీయ స్థాయి అవుటాండింగ్ ఎచీవ్ మెంట్స్ అండ్ రిమార్కుబుల్ కంట్రిబ్యూషన్ ఇన్ ది ఫార్మాసూటికల్ ఎడ్యుకేషన్ అనే అంశంపై కళాశాలకు చెందిన అధ్యాపకుడు డి సాంసన్ ఇజ్రయేల్ భారత్ శిక్షా గౌరవ్ పురస్కార్ అవార్డును సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ వివి నాగేశ్వరరావు తెలిపారు. అవార్డు పొందిన సందర్భంగా వివిధ అధ్యాపకులు, విద్యార్థిని, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

ఇంజినీరింగ్ అధికారుల తిరకాసు

- ఇవ్వాల్సింది రూ.15లక్షలు బిల్లు చేసింది రూ.4లక్షలు
- బిల్లులు చేయడంలో ఇబ్బందులు పెడుతున్న అధికారులు
- పర్సెంటేజీల కోసమే అధికారుల వేధింపులు
- సిఎం, కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన కాంట్రాక్టర్ అర్జునరావు


అర్జునరావు నిర్మించిన భవనం, ఫోన్‌పే చేసిన ఆధారం

ప్రజాశక్తి - వేటపాలెం

మండలంలోని రామన్నపేట పంచాయితీలో రామన్నపేట సచివాలయం, రైతు భరోసా కేంద్రం భవనాలను కాంట్రాక్టర్ చుండూరు అర్జునరావు నిర్మించారు. అతనికి రూ.15లక్షల బిల్లులు ప్రభుత్వం నుండి రావాల్సి ఉండగా కేవలం రూ.4.32లక్షలు మాత్రమే ఇచ్చారని కాంట్రాక్టర్ ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు రూ.3లక్షలు ముడుపులు ఇస్తేనే పెంచిన రేట్ల ప్రకారం బిల్లు పెడతామంటూ అసిస్టెంట్ ఇంజనీర్ రఘురాం ద్వారా డిఈ స్వర్ణ శేషయ్య అడిగిచ్చారని బాధితుడు చేసిన ఆరోపణలు ఇప్పుడు మండలంలో హాట్ టాపిక్ అయ్యింది. సిఎం జగన్మోహన్ రెడ్డి, కలెక్టర్ రంజిత్ భాషాకు తాను ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కాంట్రాక్టర్ తెలిపిన వివరాల ప్రకారం ప్రైవేటు కాంట్రాక్ట్ పనులు చేసుకునే తాను 2021నుండి సచివాలయం, రైతు భరోసా కేంద్రాల నిర్మాణ పనులు చేపట్టాలని అడిగితే నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. అసిస్టెంట్ ఇంజనీరు రఘురాం ఇప్పటివరకు ఎంత ఖర్చుయినదని తనను వివరాలు అడిగారని అన్నారు. ఖర్చు నేను రాసుకోలేదని బదులు ఇవ్వంగానే రూ.3లక్షలు ఇస్తే పెంచిన రేట్లతో బిల్లులు పెడతామనీ డిఈ చెప్పమన్నాడని చెప్పారు. ముందు బిల్లు పెట్టండని బ్రతిమిలాడకొన్నన్నట్లు తెలిపారు. అసిస్టెంట్ ఇంజనీర్ రఘురాంకి రూ.25వేలు ఫోన్‌పే చేసి డిఇ ఇంటికెళ్ళి రూ.లక్ష ఇస్తే ఎలాంటి దయ దక్షిణ్యాలు లేకుండా రూ.15లక్షల పెట్టాల్సిన బిల్లు కేవలం రూ.4లక్షల 80వేలకు బిల్లు పెడితే తనకు రూ.4లక్షల 32వేలు చేతికి వచ్చాయని వాపోయాడు. మండలంలోని చల్లారెడ్డిపాలెం, వేటపాలెం పంచాయితీలో నిర్మిస్తున్న సచివాలయాలకు పెంచిన రేట్లతో బిల్లులు పెట్టి అడిగినంత ఇవ్వలేదనే కారణంతో తనకు బిల్లు పెట్టకుండా దిక్కున్న చోట చెప్పుకోమంటూ దుర్భాషలాడటం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. ఇప్పటికైనా సిఎం, ఉన్నతాధికారులు కలుగజేసుకొని తనకు న్యాయం చేయాలని కాంట్రాక్టర్ అర్జునరావు వేడుకున్నారు.

డబ్బు అడిగాననడం అవాస్తవం

తాను ఎలాంటి కమిషన్లు అడగలేదని, తనపై చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని పిఆర్‌ఐ డిఇ ఎస్ శేషయ్య తెలిపారు. పెంచిన బిల్లులు పెట్టాలనేది రాష్ట్ర ప్రభుత్వ పాలసీ అని చెప్పారు. తన చేతుల్లో ఏమీలేదని అన్నారు.

జీవామృతం తయారీ విధానం చూపుతున్న అధికారులు

ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి పెంచాలి

ప్రజాశక్తి - రేపల్లె

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన పంటలతో పాటు అధిక దిగుబడులు పొందవచ్చునని నేచరల్ ఫార్మింగ్ మాస్టర్ ట్రైనర్ ప్రసాద్ తెలిపారు. మండలంలోని ఉప్పూడి గ్రామంలో శుక్రవారం రైతులకు అందించే వరినారుకు ద్రవ జీవామృతం తయారు చేసే విధానం నేర్పించారు. ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయంలో ద్రవ జీవామృతంతో సూక్ష్మజీవులు అభివృద్ధి చెంది, పైరు ఏపుగా పెరుగుతుందని వివరించారు. నాణ్యమైన అధిక దిగుబడులు వస్తాయని చెప్పారు. చీడపీడలను తట్టుకుని వేరు శాతం అభివృద్ధి చెందుతుందన్నారు. రైతులు అధిక దిగుబడుల కోసం ఎరువులు, క్రిమిసంహారక మందులు విచ్చలవిడిగా వాడుతుండడంతో నేల కలుషితమవు తుందన్నారు. ఆవు, గేదల పేడ, మూత్రాలతో, పుల్లటి మజ్జిగతో తయారు చేసిన జీవామృతం, కషాయంతో ప్రకృతి వ్యవసాయం చేసి తక్కువ ఖర్చుతో అధిక లాభాలు పొందవచ్చు అన్నారు. నేల సారవంతంగా, ఆరోగ్యంగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ రిసోర్స్ పర్సన్ జి శ్రీనివాసరావు, మండల్ కోర్డినేటర్ అసి స్టెంట్ సామ్రాజ్యం, ఇంటర్నల్ కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్ వెంకటేశ్వర్లు కార్తీక్ పాల్గొన్నారు.

పోషకాహారంతోనే మంచి ఆరోగ్యం

ప్రజాశక్తి - పంగులూరు

పోషకాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని బైటమంజులూరు సర్పంచి చక్రవరం రుక్మిణి తిరుమల రాజు అన్నారు. గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో పోషకాహార మాసోత్సవాలు శుక్రవారం నిర్వహించారు. తల్లులకు టిహెచ్‌ఆర్‌ను పంపిణీ చేశారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భవతులకు, బాలింతలకు మంచి పోషకాహారం ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. దీనిని ఉపయోగించుకొని గర్భవతులు, బాలింతలు ఆరోగ్యవంతులుగా ఉండి పిల్లలకు మంచి ఆరోగ్యాన్ని ఇవ్వాలని కోరారు. గర్భిణీలు, బాలింతలకు కిట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ జి సుజాత, హెల్పర్ ఎస్ అనంతలక్ష్మి, మహిళా కానిస్టేబుల్ డి రాధమ్మ, గ్రామ పెద్ద సిహెచ్ సుబ్బరాజు పాల్గొన్నారు.

అర్ధరాత్రి విగ్రహ ఏర్పాటు ఏమిటి?

ప్రజాశక్తి - చీరాల

మున్సిపల్ అధికారుల పనితీరు దారుణంగా ఉందని, అర్ధరాత్రి సమయంలో అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు ఏమిటని, ఇది దుర్మార్గపు చర్యని ప్రజాసంఘాల నాయకులు అన్నారు. పట్టణంలోని గడియార స్తంభం సెంటర్లోని అంబేద్కర్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాసంఘాల నాయకులు, అంబేద్కర్ వాదులు మాట్లాడారు. ప్రపంచ మేధావి, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కాంస్య విగ్రహం ఏర్పాటు చేయడంలో అధికారులు తీరు విడ్డూరంగా ఉందన్నారు. అంబేద్కర్ వాదులు, ప్రజాసంఘాల నిర్ణయాలకు కట్టుబడి నూతన కాంస్య విగ్రహం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ అధికారులు, పాలకులు కలసి ఎవరికి తెలియకుండా అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయటం సిగ్గుచేటుగా ఉందన్నారు. ప్రజాభిప్రాయంతో పని లేకుండా అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేసిన వారు తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందన్నారు. జరుగుతున్న దుర్మార్గ సంఘటనలు ఖండించేందుకు ప్రజలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ప్రజావేదిక రాష్ట్ర అధ్యక్షులు గుమ్మడి ఏసురత్నం, ఎల్ జయరాజు, భాస్కర్, విజయ, దేవిడ్, అశోక్ పాల్గొన్నారు.

ఎంపిడిఒ రూతకు శుభాకాంక్షలు

ఎంపీడీవోగా రూతమ్మ

ప్రజాశక్తి - వేటపాలెం : మండల నూతన ఎంపీడీవోగా చింతల రూతమ్మ శుక్రవారం బాధ్యతలు తీసుకు న్నారు. కురిచేడు ఎంపీడీవో ఆఫీస్ సూపరెంటెంటుగా పని చేస్తూ పదోన్నతిపై వచ్చినట్లు ఆమె తెలిపారు. ఇన్చార్జి ఎంపీడీవో నేతాజీ, సూపరెంటెంట్ ఎంఎఎస్ శర్మ, యుడిసి జయరాజులు ఆమెకు బొకె అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రుతమ్మ భర్త సత్యం, పాస్టర్, ఆమె కుమార్తెలు, జూనియర్ అసిస్టెంట్ నాన్సీ సౌజన్య, పందిళ్లపల్లి, దేశాయిపేట పంచాయతీ కార్యదర్శులు శారద, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మండల స్థాయి క్రీడా పోటీలు

ప్రజాశక్తి - బాపట్ల : స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయిలో బాల బాలికల టోర్నమెం ట్ కమ్ సెలక్షన్ నిర్వహిస్తున్నట్లు ఎంఇఒ డి ప్రసాదరావు తెలిపారు. అండర్ 14 -17 క్రీడా పోటీలు ఈనెల 12, 13, 14తేదీల్లో నిర్వహిస్తున్నట్లు శుక్రవారం తెలిపారు. కబడ్డీ, ఖోఖో, షటిల్ క్రీడలు మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణంలో, 13నవలీబాల్, త్రోబాల్ వెదుళ్లపల్లి జెడ్పి హై స్కూల్లో, బాల్ బ్యాడ్మింటన్ జమ్ములపాలెం జెడ్పి హై స్కూలులో జరుగుతాయన్నారు. క్రీడల్లో పాల్గొనే విద్యార్థుల జనన ధ్రువీకరణ పత్రాలు ఆయా పాఠశాలల హెచ్ఎంల నుండి తీసుకొని రావాలన్నారు.

10న గంగవరంలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్ : మండలంలోని గంగవరం ఆరోగ్య సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో 10న ఆదివారం బిపి, షుగర్ వ్యాధి గ్రస్తులకు వైద్య శిబిరం నిర్వహిస్తు న్నట్లు వేదిక కన్వీనర్ కరి బాలచంద్రరావు తెలిపారు. షుగర్ వైద్యులు మంచాల రమేష్ కుమార్, కంటి వైద్యులు డాక్టర్ కె శ్రీమన్నా రాయణ, డాక్టర్ సమత, డాక్టర్ సతీష్ కుమార్, డాక్టర్ ఎ సాంబయ్య వైద్యపరీక్షలు చేస్తారని తెలిపారు. 2నెలలకు సరిపడా మందులు కేవలం రు.100 అందజేస్తారని నిర్వాహకులు తెలిపారు.

గడపగడపకూ ప్రభుత్వం ద్వారా ప్రజలకు చేరువ

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ప్రభుత్వం చేపట్టిన గడప గడపకు ప్రభుత్వ కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలు తెలుసుకోవడమే కాకుండా ప్రజాప్రతినిధులు, ప్రభుత్వం ప్రజలకు దగ్గర అవడానికి ఎంతో బాగుందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మెరుగు నాగార్జున అన్నారు. గ్రామంలో శుక్రవారం గడప గడపకు ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ప్రభుత్వం ప్రతి ఇంటికి ఏదో రూపంలో సంక్షేమ పథకాలు అందజేసిందని అన్నారు. ఇంకా అందని అర్హులు ఉంటే వారికి కూడా వాలంటీర్ల ద్వారా అందజేయటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ధారా రవికిరణ్మయి, ఎంపీపీ డివి లలిత కుమారి, ఉప సర్పంచ్ బుర్లె రాంప్రసాద్, ఎంపీటీసీలు కె పిచ్చయ్యశాస్త్రి, గద్దె సుశీల, మాజీ ఎంపీటీసీ కొతరపు విజయలక్ష్మి, నాయకులు కె శ్రీనివాసరావు, రెహమాన్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

గడప గడపకు కార్యక్రమంలో నాగార్జున

అచ్చ తెలుగు పదకోశ పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - అద్దంకి

పరిశోధనా రత్న, శాసన పరిశోధకులు, విద్వాన్ జ్యోతి చంద్రమౌళికి ఆచార్య కేసరి విశ్వవిద్యాలయం అధ్యాపక బృందం ఒంగోలు క్యాంపస్‌లో ఘన సన్మానం చేశారు. రచయిత, విద్వాన్ జ్యోతి చంద్రమౌళి అచ్చ తెలుగు పదకోశము అనే రచనలు పుస్తకావిష్కరణ ఒంగోలు కేసరి విశ్వ విద్యాలయం, ఆచార్య ఎం అంజిరెడ్డి మరియు వారి అధ్యాపక బృందంతో కలిసి పుస్తకాన్ని ఆవిష్కరిం చారు. ఆయనను పూలమాలలతో గౌరవించి, శాలువాలతో ఘనంగా సన్మానించినారు. ఈ కార్యక్రమం లో డీన్ వెంకటేశ్వరరెడ్డి, రిజిస్ట్రార్ హరిబాబు, రిటైర్డ్ ఆర్‌జెడి యు దేవపాలన, ఎపి ఎస్సీ, ఎస్టీ, బీసీ అండ్ మైనారిటీస్ ఐక్య వేదిక అధ్యక్షులు జ్యోతి రమేష్ బాబు, జ్యోతి శ్రీమన్నారాయణమూర్తి, బుజ్జి కొమ్మాలపాటి, బండారు చంటిబాబు, అంకం నాగరాజు, అద్దంకి హర్షిణి కాలేజ్ ప్రిన్సిపాల్ నరసింహారావు, గాడేపల్లి దివాకరదత్తు పాల్గొన్నారు.

జ్యోతి చంద్రమౌళికి ఘన సన్మానం

ట్రెజరీ కార్యాలయానికి ఇన్వర్టర్ బహూకరణ

ప్రజాశక్తి - అద్దంకి

తరచుగా విద్యుత్ అంతరాయం జరుగుతున్న నేపథ్యంలో సబ్ ట్రెజరీ సిబ్బంది ఇబ్బందులను గమనించిన ఆంధ్ర ప్రదేశ్ విశ్రాంత ఉద్యోగుల మరియు ఉపాధ్యాయుల సంఘం అద్దంకి కార్యదర్శి టి కృష్ణయ్య, లక్కరాజు చంద్ర శేఖర్ తమ సంఘంతో సంప్రదించి రూ.24వేల విలువైన ఇన్వర్టర్‌ను సబ్ ట్రెజరీ ఆఫీసర్ కె లక్ష్మీ ప్రసన్నకు అందచేశారు. కార్యక్రమంలో షేక్ మస్తానరావు, అసోసియేట్ అధ్యక్షుడు శ్రీరామచంద్రమూర్తి, కొప్పరపు అశ్వత్థ నారాయణ, లక్కరాజు చంద్ర శేఖర్, షేక్ ఎస్‌జి సైదా, మారం కోటేశ్వరరావు, కె కొండలరావు, పి సునీత, కె శ్రీనివాసులు, వామరాజు వెంకటేశ్వర్లు, లక్కరాజు శ్రీనివాసరావు, కెవి పోలిరెడ్డి పాల్గొన్నారు.

ట్రెజరీకి ఇన్వర్టర్ ఇస్తున్న వి.ఉద్యోగులు

ఎస్సీ, ఎస్టీ రాజ్యాంగ హక్కుల రక్షణ సదస్సు

ప్రజాశక్తి - రేపల్లె : ఎస్సీ, ఎస్టీ రాజ్యాంగ హక్కుల రక్షణ కోసం విజయవాడ లయోలా కాలేజీ ఆడిటోరియం శనివారం ఉదయం 10గంటలకు జరుగనున్న సదస్సును జయప్రదం చేయాలని జై భీం భారత్ పార్టీ బాపట్ల జిల్లా అధ్యక్షులు దోవా రమేష్ రాంజీ కోరారు. ఎస్సీ, ఎస్టీలకు గత ప్రభుత్వాలు ఇచ్చిన 50లక్షల ఎకరాల అసైన్మెంట్ భూములను కాపాడుకుందాం అనే నినాదంతో సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువస్తున్న అసైన్మెంట్ భూముల ఆర్డినెన్స్ ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సదస్సులో మాజీ న్యాయమూర్తి, హైకోర్టు న్యాయవాది, జైభీం భారత్ పార్టీ అధ్యక్షులు జడా శ్రావణ్ కుమార్, ఐఆర్‌ఎస్ అధికారి ఉప్పులేటి దేవీ ప్రసాద్ పాల్గొంటారని తెలిపారు. మాల మహాసభ అధ్యక్షులు మల్లెల వెంకటరావు, ఏపీ ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ, కెవిపిఎస్ ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి, రెల్లి సంఘ నాయకులు సిరంసెట్టి నాగేంద్రరావు సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు

పాకల విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలం పాకల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డివిఎస్.ప్రసాద్ తెలిపారు. ప్రకాశం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శింగరాయకొండ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఈనెల 6న జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించారు. అండర్-16 విభాగంలో కె.సిపోరా 100, 300 మీటర్ రన్నింగ్ మరియు షాట్‌పుట్, జి.తిరుపతి 800 మీటర్ల రన్నింగ్, అండర్ – 18 విభాగం డిస్కస్‌త్రో కె.నందిని ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఏలూరులో ఈ నెల 19,20,21 తేదీల్లో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి పోటీల్లో ఈ విద్యార్థులు పాల్గొంటారని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు పిల్లి హజరత్తయ్య తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు ఉపాధ్యా యులు, గ్రామస్తులు, పాఠశాల పూర్వ విద్యార్థులు అభినందనలు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

పాదయాత్రకు ప్రజలు సహకరించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

ప్రకాశం జిల్లా పాలకుల వివక్షకు గురవుతూనే ఉందని సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ ఆవేదన వ్యక్తం చేశారు. రెండున్నర దశాబ్దాల క్రితం ప్రారంభించిన శ్రీ పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం నేటికీ పూర్తి కాకపోవడం పాలకుల వివక్షను ఎత్తిచూపుతుందన్నారు. స్థానిక కార్యాలయంలో సిపిఎం శాఖ కార్యదర్శులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హనీఫ్ మాట్లాడుతూ దొనకొండ పారిశ్రామిక వాడ, కనిగిరి నిమ్జ్ లాంటి ఉపాధి కల్పించే ప్రాజెక్టులను సైతం ప్రభుత్వాలు గాలికి వదిలేసాయన్నారు. ప్రకాశం జిల్లా అంతటా కరువు రాజ్యమేలు తుందన్నారు. ఈ పరిస్థితులను గట్టెక్కించేందుకు సిపిఎం ఆది నుంచి ఉద్యమాలు చేపట్టిందన్నారు. జిల్లా అభివృద్ధి విషయంలోనూ రాజీలేని పోరాటలు నడిపిందన్నారు. వెలిగొండ ప్రాజెక్టు కోసం సిపిఎం అగ్రనేత బి.వి.రాఘవులు ఈ ప్రాంతంలో పాదయాత్ర చేసిన విషయాన్ని గుర్తు చేశారు. వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయాలని, జిల్లా అభివృద్ధికి రూ.10 వేల కోట్లు నిధులు కేటాయించాలని, వెనుకబడిన జిల్లాగా ప్రకాశాన్ని గుర్తించాలని ఈ నెల 10 నుంచి సిపిఎం పోరుబాట పేరుతో పాదయాత్ర మొదలై 23వ తేదీతో ముగుస్తుందన్నారు. 14 రోజుల పాటు 300 కిలో మీటర్లు సిపిఎం బృందం పాదయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు పాదయాత్రలో స్వచ్ఛందగా పాల్గొని జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అనంతరం సిపిఎం జిల్లా నాయకులు పూనాటి ఆంజనేయులు, జివి.కొండారెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి గుమ్మా బాలనాగయ్య, పట్టణ కార్యదర్శి డి.సోమయ్య, నాయకులు డికెఎం.రఫీ, జవ్వాజి రాజు, పి. రూబెన్, షేక్ నన్నేసా, కట్ల సుబ్బారావు, బాల శేషయ్య, షేక్ కరిముల్లా, జక్కి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సయ్యద్ హనీఫ్

మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షురాలిగా సుమతి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్ మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షురాలిగా అరికట్ల సుమతి నియమితులయ్యారు. ఈనెల 6,7 తేదీల్లో బెంగళూరులో నిర్వహించిన జాతీయస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశంలో అరికట్ల సుమతిని ఆంధ్ర మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షురాలిగా నియమిస్తూ జాతీయ కార్యదర్శి డేవిడ్ ప్రేమనాథ్, ఆంధ్ర కార్యదర్శి సైకం రాంప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ స్థాపించి 45 సంవత్సరాలు అయ్యింది. ఆంధ్రప్రదేశ్ తొలి మహిళ అధ్యక్షురాలుగా ఎన్నికైన వ్యక్తి అరికట్ల సుమితి కావటం గమనార్హం. ఓ సాధారణ రైతు కుటుంబంలో జన్మించి సుమతి భర్త అరికట్ల శ్రీనివాసరావు సహాయ సహ కారాలతో అనేకమంది పేద విద్యార్థులకు ప్రతి సంవత్సరం ఉచితంగా సైకిళ్ళు, కుట్టుమిషన్లు, ల్యాప్‌టాప్ అందజేస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా అరికట్ల సుమతి మాట్లాడుతూ క్రీడల పట్ల ఉన్న ఆసక్తితో మాస్టర్స్ అథ్లెటిక్స్



అసోసియేషన్ ద్వారా రాష్ట్రంలో క్రీడలను అభివృద్ధి చేయడానికి తనవంతు కృషి చేస్తానని తెలియజేశారు. తనకు అవకాశం కల్పించిన జాతీయ కార్యదర్శి డేవిడ్ ప్రేమనాథ్, రాష్ట్ర కార్యదర్శి సైకం రాంప్రసాద్, అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి శివశంకరరావుకు ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు. మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలుగా నియమితులైన అరికట్ల సుమతిని పలు క్రీడా సంఘాల ప్రతినిధులు అభినందించారు.

ప్రజాకళాకారులకు గరికపాటి స్ఫూర్తి

ప్రజాశక్తి-చీమకుర్తి

ప్రజాకళాకారుడు గరికపాటి రాజారావు ఎందరో కళా కారులకు స్ఫూర్తి దాయకమని ప్రజానాట్య మండలి జిల్లా ప్రధాన కార్యదర్శి పొత్తూరి సురేష్ తెలిపారు. స్థానిక పంగులూరి కృష్ణయ్య భవనంలో గరికపాటి రాజారావు 60వ వర్ధంతి శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు ఉబ్బా కోటేశ్వరరావు గరికపాటి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పొత్తూరి సురేష్ మాట్లాడుతూ ప్రజల దైనందిక జీవన ప్రమాణాలు అంతకంతకూ మెరుగుపడేలా ,అసమానతలు తగ్గేలా స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం మరింత బలపడేలా దేశాన్ని నడిపించడం కోసం ప్రభుత్వాలు కర్తవ్యాన్ని నిర్వర్తించాలని కళల రూపంలో ప్రజలను మేల్కొల్పుతూ ప్రజలను చైతన్యం చేయడం కోసం డాక్టర్ గరికపాటిరాజారావు స్ఫూర్తితో ముందుకు సాగుతామన్నారు. అనంతరం ఉబ్బా కోటేశ్వరరావును సిఐటియు నాయకులు పల్లాపల్లి ఆంజనేయులు చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షుడు బి. పీటర్,సుజాత, ఇందిర, జ్యోతి, సూరి, సునంద, మోహనరావు, పోకూరి శంకర్ పాల్గొన్నారు. **ఒంగోలు కలెక్టరేట్ :** కళ కళ కోసం కాదు కళ ప్రజల కోసమని నమ్మి, నమ్మిన సిద్ధాంతం కోసం తన చివరి ప్రాణం వరకు పోరాడిన గొప్ప కళాకారుడు గరికపాటి రాజారావు అని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు చొప్పర జాలన్న తెలిపారు. ప్రజా కళాకారుడు గరికపాటి రాజారావు 60వ వర్ధంతి అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ప్రకాశం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక మాదాల నారాయణస్వామి భవనంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జాలన్న మాట్లాడుతూ బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటం నుంచి స్వాతంత్ర అనంతరం దేశానికి సామ్రాజ్యవాద దేశాల నుంచి విముక్తి చేయాలని నిర్వహించిన పోరాటంలో గరికపాటి రాజారావు పాత్ర ఉందన్నారు. స్వాతంత్ర ఉద్యమంలో ప్రజలను చైతన్యవంతం చేయడం కోసం అనేక సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారన్నారు. స్వాతంత్ర్యం అనంతరం దేశానికి నిజమైన స్వాతంత్రం రాలేదని మా భూమి నాటకం ద్వారా రాష్ట్ర మొత్తం తిరిగి ప్రదర్శనలు ఇచ్చారన్నారు. ప్రజానాట్యమండలిని స్థాపించి ప్రజల కష్టాలు, వారు పడుతున్న బాధలను ప్రజా కలల రూపంలో ప్రచారం చేశారన్నారు. నేడు కళలు అంతరించి పోతున్న సమయంలో కళాకారులు భూస్వాములు, సామ్రాజ్య వాదులు, ప్రభుత్వ పాలకులకు మెడలో వంచుతున్న సమయంలో గరికపాటి రాజారావు వంటి నిజమైన కళాకారులని, శ్రామిక వర్గ ప్రజల కోసం తపించే యోధులను గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గరికపాటి రాజారావు అందించిన విప్లవ సాంస్కృతిక స్ఫూర్తితో మనం ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర సహాయ కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు, సిపిఐ నగర కార్యదర్శి పివిఆర్. చౌదరి, ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.పద్మ, పిడిఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్.రాజశేఖర్, పివైఎల్ జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్, మహిళా సంఘం నాయకురాలు అమ్మాజీ, బ్రహ్మానందం, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న ప్రజానాట్యమండలి నాయకులు

ప్రజలకు అందుబాటులో కార్పొరేట్ వైద్యసేవలు

- డాక్టర్ పోతినేని రమేష్
- ఇకపై ఆస్టర్ రమేష్ నల్లూరి హాస్పిటల్ నిర్వహణ

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

నల్లూరి నర్సింగ్ హోమ్ ఇకపై ఆస్టర్ రమేష్ నల్లూరి హాస్పిటల్‌గా సరికొత్త బ్రాండ్ నేమ్ తో కార్పొరేట్ వైద్య సేవలను ప్రకాశం జిల్లా ప్రజలకు అందుబాటులోనికి తీసుకొస్తుంది. ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్, నల్లూరి నర్సింగ్ హోమ్ సంయుక్తంగా సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించడానికి నిర్ణయించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పోతినేని రమేష్ బాబు మాట్లాడుతూ నల్లూరి నర్సింగ్ హోమ్‌లో ఇకపై పూర్తి నిర్వహణ, పర్యవేక్షణ బాధ్యతలు ఆస్టర్ రమేష్ హాస్పిటల్ చూసుకుంటుందన్నారు. ప్రస్తుతం ఉన్న స్పెషాలిటీ సర్వీసులతో పాటు కార్డియాలజీ, న్యూరాలజీ, గ్యాస్ట్రోఎంట్రాలజీ, ఆర్థోపెడిక్ విభాగాలను అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. క్రిటికల్ కేర్, ఇన్ పేషెంట్ వైద్య సేవలను ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ టెలి ఐసియు, టెలి ఎమర్జెన్సీ రూమ్ (క్లౌడ్ డాక్స్ రమేష్)మెయిన్ హబ్‌కు అనుసంధానం చేయడం ద్వారా మరింత మెరుగైన నాణ్యమైన వైద్య చికిత్సలు 24 గంటలు ఆస్టర్ రమేష్ నల్లూరి హాస్పిటల్‌లో అందుబాటులోకి తీసుకొస్తున్నామని డాక్టర్ రమేష్ బాబు తెలిపారు. ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ గ్రూప్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ పావులూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఒంగోలులోని ఆస్టర్ రమేష్ హాస్పిటల్, ఆస్టర్ రమేష్ నల్లూరి హాస్పిటల్స్ రెండు కలిసి సంఘటితంగా ఈ ప్రాంత ప్రజలకు అన్ని రకాల వైద్య సర్వీసులు అందిస్తాయన్నారు. ప్రముఖ సీనియర్ వైద్య నిపుణులు డాక్టర్ నల్లూరి రంగారావు మాట్లాడుతూ ఈ రెండు హాస్పిటల్స్ కలయికతో ఒంగోలు ప్రాంత ప్రజలకు నాణ్యమైన సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నల్లూరి రాఘవరావు, డాక్టర్ నల్లూరి రంగారావు, డాక్టర్ నల్లూరి అరుణా రావు, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ హరికుమార్, బిజినెస్ హెడ్ డాక్టర్ కార్తీక్ చౌదరి, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ వంశీ, వైద్యులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు

మాట్లాడుతున్న డాక్టర్ రంగారావు